జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 సంచిక :41 మంగళవారం 13-10-2026 పేజీలు:8 వెల:రు 3/-

https://www.epaperjournalistdiary.com/

దద్దరిల్లిన ఢిల్లీ

రాహుల్ గాంధీ నేతృత్వంలో సుప్రీంకోర్టు దిశగా భారీ ర్యాలీ

ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమి మహా ప్రదర్శన

- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణల్లో అక్రమాలపై న్యాయపరమైన చర్యలు కోరిన విపక్షాలు
- బారికేడ్లతో ర్యాలీని అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీల నేతల భాగస్వామ్యం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతల యత్నం
- పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- వీధి నిరసనతో పాటు న్యాయపోరాటానికి కాంగ్రెస్ సిద్ధం

ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు కాపాడాలనే డిమాండ్లతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండియా కూటమి నేతలు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'చలో ఢిల్లీ--మార్చ్ ఫర్ డెమోక్రసీ' నినాదంతో సుప్రీంకోర్టు దిశగా సాగిన ఈ ర్యాలీని పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్ సహా పలువురు విపక్ష నేతలు ఆందోళనలో పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నికల వ్యవహారంపై తమ అభ్యంతరాలను వివరించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతలు ప్రయత్నించగా, న్యాయపరమైన పరిష్కారం కోరేవారు పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఆయన సూచించినట్లు సమాచారం. దీంతో వీధి నిరసనలతో పాటు న్యాయపోరాటం ద్వారానూ ఎన్నికల సంఘంపై ఒత్తిడి పెంచేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

02

ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

ఓట్ల తొలగింపునకు మోడీ, షా, జ్ఞానేశ్ కుట్ర

- గతంలో అర్హులకు ఓటు హక్కు కల్పించేందుకే ఎస్ఐఆర్
- జనాభా పెరుగుతుంటే ఓట్ల సంఖ్య ఎలా తగ్గుతుంది?
- రాహుల్ నాయకత్వంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం
- ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత
- ఎన్నికల సంఘం పనితీరులో పారదర్శకతకు డిమాండ్
- అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించొద్దని స్పష్టీకరణ
- తెలంగాణ కాంగ్రెస్ నేతలకు ఢిల్లీలో సీఎం దిశానిర్దేశం

ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓటర్ల సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించిన ఆయన, ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్‌గాంధీ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.

న్యూఢిల్లీ,

దేశ ప్రజల ఓటు హక్కును కాపాడుకునేందుకు తాము చేస్తున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. బ్రిటీష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన తెచ్చిపెందుకు అనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.

02

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర అర్లేకర్
- కేరళకు ఓం ప్రకాశ్ మాథుర్ బదిలీ
- ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ నియామకం
- కర్ణాటకకు సుధా యాదవ్ ఎంపిక
- ఉత్తరాఖండ్ గవర్నర్‌గా ధాల్ సింగ్ బిసేన్
- సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్
- ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు

02

ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు

- తూర్పు సముద్ర జలాల దిశగా క్షిపణుల ప్రయోగం
- ప్యోంగ్యాంగ్ నుంచి పరీక్షించినట్లు దక్షిణ కొరియా వెల్లడి
- ఓ క్షిపణి 900 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు సమాచారం
- 17 నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను గుర్తించిన జపాన్
- తొలి క్షిపణి 220 కిలోమీటర్లు ప్రయాణించినట్లు అంచనా
- రెండో క్షిపణి దూరం 910 కిలోమీటర్లుగా గుర్తింపు
- హైపర్‌సోనిక్ ఆయుధ పరీక్ష జరిగి ఉండొచ్చని జపాన్ అనుమానం
- కొరియా దేశాల మధ్య ఉద్రిక్తతల వేళ తాజా ప్రయోగాలు

మహిళలకు 50 శాతం సీట్లు

- రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు ప్రాధాన్యం
- ప్రకటించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత
- మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహిస్తామని వెల్లడి
- బంజారాహిల్స్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- మహిళా నాయకులతో కలిసి బతుకమ్మ ఆడిన కవిత
- మహిళలు, బహుజనుల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక
- భావితరాలకు బతుకమ్మ పాటలను అందించాలని పిలుపు

హైదరాబాద్,

మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తామని, తమ పార్టీ తరపున రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మహిళలకు 50 శాతం సీట్లు కేటాయిస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. రాజకీయాల్లో మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంతో పాటు మహిళలు, బహుజనుల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా నాయకులతో కలిసి బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ సంబురాలు చేసుకున్నారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.

-మిగతా 2 లో

సౌదీపై ఎడతెగని దాడులు

- క్షిపణుల వర్షం కురిపిస్తున్న హౌతీలు
- దమ్మామ్ విమానాశ్రయంపై ఎటాక్
- తాజా దాడుల్లో ఒకరు మృతి.. 11 మందికి గాయాలు
- క్షతగాత్రుల్లో ముగ్గురు భారతీయులు.. ఐసీయూలో చికిత్స

రియాద్:

సౌదీ అరేబియాపై హౌతీ రెబెల్స్ దాడులు ఆగడం లేదు. సౌదీలోని ప్రధాన విమానాశ్రయాలపై వరుస దాడులు చేస్తున్న హౌతీలు, తాజాగా దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టుపై క్షిపణులతో విరుచుకుపడ్డారు. అటు రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై మరోసారి దాడిచేశారు. తాజా దాడిలో ఒక పాకిస్తాన్ జాతీయుడు మరణించగా,

-మిగతా 2 లో

తిరుపతికి మహర్దశ

రూ.3,222 కోట్లతో అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు శ్రీకారం

- 'తుడా' పరిధిలో రూ.3,222 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- అమరావతి నుంచి వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- శ్రీవారి భక్తుల కోసం భారీ వసతి, అన్నప్రసాద సముదాయాల నిర్మాణం
- టీటీడీ ఉద్యోగుల కోసం 418 ఎకరాల్లో నివాస లేఅవుట్ అభివృద్ధి
- నగరంలో ట్రాఫిక్‌ను తగ్గించేలా 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం



తిరుపతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

తిరుపతి పుణ్యక్షేత్రం అభివృద్ధిలో మరో కీలక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. 'తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ' (తుడా) పరిధిలో మొత్తం రూ. 3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం శంకుస్థాపన చేశారు. అమరావతిలోని తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ఆయన ఈ ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా శ్రీవారి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, టీటీడీ ఉద్యోగుల సొంతింటి కలను నెరవేర్చడం, నగరంలో మౌలిక

-మిగతా 2 లో

05

ఏపీ స్థానిక ఎన్నికలు.. మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారు

- ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు
- మొత్తం 106 మున్సిపాలిటీలు, -17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల
- మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు
- అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు
- రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది

ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుంది!

- జంతర్ మంతర్ గుర్తింపు రద్దుపై అభిజీత్ దీప్కే ఆగ్రహం
- నిరసనలంటేనే కేంద్రానికి సమస్య అంటూ విమర్శలు
- ప్రజాస్వామ్యాన్ని కూడా రద్దు చేస్తారా అని మోదీపై ప్రశ్న
- నిరసనలకు మూడు కొత్త వేదికలను గుర్తించిన ఢిల్లీ పోలీసులు
- ఎస్ఐఆర్ వివాదంపై జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు ప్రతిపక్షాల డిమాండ్
- జంతర్ మంతర్ వద్ద కట్టుదిట్టమైన భద్రత.. నిరసనకారుల అరెస్టులు

న్యూఢిల్లీ:
ఢిల్లీలో నిరసనలకు వేదికగా ఉన్న జంతర్ మంతర్ గుర్తింపును రద్దు చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక దేశమంతా జంతర్ మంతర్ అవుతుందని ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్రజలు నిరసన తెలపడం కేంద్రానికి సమస్యగా మారిందని విమర్శించారు. జంతర్ మంతర్ హోదాను రద్దు చేసిన ప్రధాని మోదీ, రేపు ప్రజాస్వామ్యాన్ని కూడా రద్దు చేస్తారా అని ప్రశ్నించారు. ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. నిరసనల కోసం రామ్‌లీలా మైదానం, బురారీ మైదానం, సీబీడీ మైదానాలను కొత్త వేదికలుగా గుర్తించారు. మరోవైపు, ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) వివాదంపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు, సీజేపీ ఆందోళనలు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జంతర్ మంతర్ వద్ద భద్రతను పెంచి, నిరసనకారులను పోలీసులు అరెస్టు చేస్తున్నారు.

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

- రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఉత్తర్వులు
- తమిళనాడు గవర్నర్‌గా రాజేంద్ర అర్లేకర్
- కేరళకు ఓం ప్రకాశ్ మాథుర్ బదిలీ
- ఒడిశా గవర్నర్‌గా బ్రజ్ మోహన్ నియామకం
- కర్ణాటకకు సుధా యాదవ్ ఎంపిక
- ఉత్తరాఖండ్ గవర్నర్‌గా ధాల్ సింగ్ బిసేన్
- సిక్కిం గవర్నర్‌గా దుష్యంత్ గౌతమ్
- ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు

న్యూఢిల్లీ:
ఆరు రాష్ట్రాలకు నూతన గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కేరళ గవర్నర్‌గా ఉంటూ తమిళనాడుకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌కు తమిళనాడు పూర్తి స్థాయి గవర్నర్‌గా బాధ్యతలు అప్పగించారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్న ఓం ప్రకాశ్ మాథుర్‌ను కేరళకు బదిలీ చేశారు. ఇక ఒడిశా గవర్నర్‌గా మాజీ ఎంపీ బ్రజ్ మోహన్‌ను నియమించారు. మాజీ ఎంపీ సుధా యాదవ్‌కు కర్ణాటక గవర్నర్ బాధ్యతలు అప్పగించారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ధాల్ సింగ్ బిసేన్‌ను ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమించారు. బీజేపీ మాజీ నేత దుష్యంత్ గౌతమ్‌ను సిక్కిం గవర్నర్‌గా నియమిస్తూ రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ చేశారు. తాజా నియామకాలతో ఆరు రాష్ట్రాల్లో గవర్నర్ల బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి.

మహిళలకు 50 శాతం సీట్లు

మొదటి తరువాయి

పార్టీ కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా పండుగ వేడుకలు నిర్వహించడం సంతోషంగా ఉందని కవిత పేర్కొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహిళలకు రాజకీయాల్లో సముచిత ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇతర పార్టీలు మహిళా రిజర్వేషన్లను అమలు చేసినా, చేయకపోయినా తమ పార్టీ మాత్రం మహిళలకు సగం సీట్లు కేటాయిస్తుందని స్పష్టం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు రాజకీయ ప్రాతినిధ్యం ఎంతో అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని కవిత అన్నారు. ప్రతి ఒక్కరూ బతుకమ్మ పాటలను నేర్చుకుని, వాటిని భావితరాలకు అందించాలని సూచించారు. తనకు బతుకమ్మ పండుగ అంటే ఎంతో ఇష్టమని పేర్కొంటూ, గౌరమ్మ ఆశీస్సులతో తెలంగాణ ఆడబిడ్డలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సౌదీపై ఎడతెగని దాడులు

మొదటి తరువాయి

మరో 11 మంది గాయపడినట్లు సౌదీ ప్రభుత్వం వెల్లడించింది. దాడుల వల్ల విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌లో చెలరేగిన మంటలను అదుపు చేసినట్లు పేర్కొంది. మరోవైపు సౌదీ ఇంధన దిగ్గజం అరామ్‌కోకు చెందిన రెండు కేంద్రాలపై కూడా దాడులు చేసినట్లు హౌతీలు ప్రకటించారు. దశాబ్దకాలంలో సౌదీ భూభాగంపై జరిగిన అత్యంత ఘోరమైన దాడుల్లో ఆదివారం హౌతీలు చేసిన దాడి ఒకటి. సౌదీ రాజధానిలోని రవాణా కేంద్రాలను తమ దళాల యుద్ధక్షేత్రంగా హౌతీలు అభివర్ణించారు. వాటిపై ఇంకా దాడులు కొనసాగిస్తామని హెచ్చరించారు. అలా ప్రకటించిన కొద్ది గంటలకే కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఓ క్షిపణి తాకిందని, అక్కడ మంటలు చెలరేగాయని సౌదీ సంకీర్ణ దళాలు వెల్లడించాయి. మరో క్షిపణిని గాలిలోనే తమ దళాలు అడ్డుకున్నాయని పేర్కొంది. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్ట్‌పై డ్రోన్‌ను కూల్చేశామని తెలిపింది. అలాగే సోమవారం తెల్లవారుజామున, దక్షిణ సౌదీ నగరంలోని ఖమీస్ ముషైత్ సైనిక స్థావరం వైపు దూసుకొచ్చిన హౌతీ బాలిస్టిక్ క్షిపణిని కూడా అడ్డుకుని, ఉంటుందని వెల్లడించారు. సదస్సుకు హాజరైన అంతర్జాతీయ ప్రతినిధుల భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అయితే ముప్పు పూర్తిగా తొలగిపోయిందని భావించరాదని సూచించారు.

ఐసీసీలో ముగ్గురు భారతీయులు

రియాద్‌లో ఉన్న కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడిలో గాయపడిన ముగ్గురు భారతీయులు ప్రస్తుతం ఐసీసీలో చికిత్స పొందుతున్నారు. వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని సౌదీ అరేబియాలోని భారత రాయబార కార్యాలయం సోమవారం వెల్లడించింది.

దద్దరిల్లిన ఢిల్లీ

- రాహుల్ గాంధీ నేతృత్వంలో సుప్రీంకోర్టు దిశగా భారీ ర్యాలీ
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- ఓటర్ల జాబితా సవరణల్లో అక్రమాలపై న్యాయపరమైన చర్యలు కోరిన విపక్షాలు
- బారికేడ్లతో ర్యాలీని అడ్డుకున్న ఢిల్లీ పోలీసులు
- కాంగ్రెస్‌తో పాటు ఇండియా కూటమి పార్టీల నేతల భాగస్వామ్యం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు విపక్ష నేతల యత్నం
- పిటిషన్ దాఖలు చేసుకోవాలని సూచించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
- వీధి నిరసనతో పాటు న్యాయపోరాటానికి కాంగ్రెస్ సిద్ధం

న్యూఢిల్లీ,
కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారీ ర్యాలీతో దేశ రాజధాని ఢిల్లీ రాజకీయంగా వేడెక్కింది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు, ఇండియా కూటమి నేతలు 'చలో ఢిల్లీ--మార్చ్ ఫర్ డెమోక్రసీ' నినాదంతో సుప్రీంకోర్టు దిశగా ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ర్యాలీ సుప్రీంకోర్టు వైపు సాగుతుండగా భగవాన్ దాస్ రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు నిరసనకారులను అడ్డుకున్నాయి. దీంతో పోలీసులకు, కార్యకర్తలకు మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని, ఓటు హక్కును పరిరక్షించాలని, సీఈసీ రాజీనామా చేయాలని నినాదాలు చేస్తూ కార్యకర్తలు ముందుకు సాగేందుకు ప్రయత్నించారు. ర్యాలీకి ముందు నుంచే కానాట్ ప్లేస్, మండీ హౌస్ పరిసరాల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు గుమిగూడారు. ఈ నిరసనలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్‌విందర్ సింగ్ సుఖు తదితరులు పాల్గొన్నారు. ఇండియా కూటమిలోని వివిధ పార్టీల నాయకులు కూడా నిరసనకు మద్దతు తెలిపారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలు ర్యాలీలో పాల్గొనడంతో కార్యకర్తల్లో ఉత్సాహం కనిపించింది. మరోవైపు, ఎన్నికల వ్యవహారంపై తమ అభ్యంతరాలను వివరించేందుకు ఇండియా కూటమి నేతలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు ప్రయత్నించారు. అయితే, ఈ అంశాలు ఇప్పటికే న్యాయస్థానం పరిధిలో ఉన్నందున రాజకీయ పార్టీల ప్రతినిధి బృందాన్ని ప్రత్యక్షంగా కలవడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. సమస్యపై న్యాయపరమైన పరిష్కారం కోరేవారు పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని సూచించారు. చట్ట ప్రకారం పిటిషన్లను పరిశీలిస్తామని పేర్కొన్నారు. సీజేఐని కలిసి వినతిపత్రం సమర్పించాలన్న ప్రయత్నం ఫలించకపోవడంతో, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా న్యాయపోరాటం చేయాలని కాంగ్రెస్ నిర్ణయించినట్లు కథనం పేర్కొంది. వీధుల్లో నిరసనలతో పాటు న్యాయస్థానంలో పిటిషన్ ద్వారా కూడా ఎన్నికల వ్యవహారంపై ఒత్తిడి పెంచేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయి. ఓటర్ల జాబితాల సవరణ, ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అభ్యంతరాలు తాజా రాజకీయ పరిణామాలతో మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

ఇది మరో స్వాతంత్ర్య పోరాటం

మొదటి తరువాయి

ఓట్ .. డెస్ ' ఆందోళనలో భాగంగా ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడారు. అనాడు స్వాతంత్ర్యం కోసం మైదాన్ గో బ్యాక్ ఉద్యమం సాగింది, ఇప్పుడు ఓటు హక్కు కోసం జ్ఞానేశ్ గో బ్యాక్, ఎస్ఐఆర్ గో బ్యాక్ నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని చెప్పారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు.
గతంలోనూ ప్రత్యేక సమగ్ర ఓట్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా ఓటు హక్కు లేనివారికి ఓటు హక్కు కల్పించాలని సీఎం గుర్తు చేశారు. తర్వాత ఇందిరా గాంధీ, అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వాల కాలంలోనూ ఎస్ఐఆర్ ప్రక్రియ జరిగిందని గుర్తు చేశారు. అయితే, గతంలో ఓట్ల జాబితాలో పేర్లు లేని అర్హులైన వారిని చేర్చడపైనే ప్రధానంగా దృష్టి పెట్టేవారని అన్నారు. ఇప్పుడు మోడీ, అమిత్ షా పాలనలో మాత్రం ఇప్పటికి ఓటు హక్కు ఉన్నవారిని పేర్లను తొలగించేయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. రాజకీయ ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు కేంద్ర ప్రభుత్వం గతంలో ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ, నార్కొటిక్స్ విభాగం వంటి సంస్థలను ఉపయోగించుకుందని, ఇప్పుడు వాటితో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కష్టమవుతోందనే ఉద్దేశంతో ఎస్ఐఆర్‌ను తెరపైకి తెచ్చారని సీఎం విమర్శించారు. ఈసీఐ ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి మోడీ ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందని ఆరోపించారు.
పారదర్శకత కోసమే నూతన ఎన్నికల సంఘంలో మార్పులు గతంలో ఎన్నికల సంఘం ఈసీ కమిషనర్ నేతృత్వంలో పనిచేసేదని, అయితే, ఈ సంస్థలో మరింత పారదర్శకత తీసుకువచ్చేందుకు ప్రధానమంత్రి పి.వి.నరసింహారావు ఉన్న సమయంలో ముగ్గురు కమిషనర్ విధానాన్ని తీసుకువచ్చారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోడీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చి, కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోంమంత్రిని చేర్చారని ఆరోపించారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి ఓటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాణాన్ని తొలత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకువచ్చింది రాహుల్‌గాంధీయేనని సీఎం వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్న బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు కూడా గొంతెత్తారని వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోడీ, అమిత్ షాలు భావిస్తే, ఆయనను తొలగించాలనే డిమాండ్‌పై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో జరుగుతున్న చర్యల వల్ల రాజకీయమాక అత్తి పొందుతున్నది బీజేపీ మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు శిఎ్ఓవ: 2014లో దేశంలో ఉన్న 81 కోట్ల మంది ఓట్లు, 2019లో 91 కోట్లకు, 2024 నాటికి 97 కోట్లకు చేరిందని, అయితే 2026లో ఇప్పటికి 13 కోట్లు ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే ఓట్లు సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు శిఎ్ఓవ: 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. జనాభా పెరుగుతున్నప్పుడు ఓట్ల సంఖ్య తగ్గడానికి కారణమేంటని సీఎం ప్రశ్నించారు. దీనికి ఎన్నికల సంఘం స్పష్టమైన సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు.
ఓట్లు ఉన్నవారు.. లేనివారంటూ రెండు వర్గాలా?
దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని సీఎం ఆలోపించారు. ఓటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాలను ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు

సియోల్:
ఉత్తర కొరియా తన ఆయుధ సామర్థ్యాన్ని పెంచుకునే ప్రయత్నాలను కొనసాగిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా పలు బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా సైనిక వర్గాలు వెల్లడించాయి. తూర్పు సముద్ర జలాల దిశగా ఈ ప్రయోగాలు జరిగినట్లు తెలిపాయి. కొరియా దేశాల మధ్య ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. దక్షిణ కొరియా సంయుక్త దళాల ప్రతినిధి జాంగ్ డో యుంగ్ వివరాల ప్రకారం.. ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ నుంచి క్షిపణులను ప్రయోగించినట్లు గుర్తించారు. ఆ దేశం గత కొన్నేళ్లుగా ప్రధాన విమానాశ్రయాన్ని కీలక క్షిపణి ప్రయోగ కేంద్రంగా ఉపయోగిస్తున్నట్లు తెలుస్తోంది. పరీక్షించిన క్షిపణుల్లో ఒకటి సుమారు 900 కిలోమీటర్లకు పైగా ప్రయాణించినట్లు జాంగ్ వెల్లడించారు. అయితే ఎన్ని క్షిపణులను గుర్తించారన్న విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. జపాన్ ఉప రక్షణ మంత్రి తకాషి కోయరి వెల్లడించిన వివరాల ప్రకారం.. 17 నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను గుర్తించారు. వాటిలో మొదటిది సుమారు 220 కిలోమీటర్లు, రెండోది దాదాపు 910 కిలోమీటర్లు ప్రయాణించినట్లు అంచనా వేశారు. ఈ క్షిపణులు జపాన్ ప్రత్యేక ఆర్థిక మండలికి వెలుపల ఉన్న సముద్ర జలాల్లో పడినట్లు సమాచారం. ఈ ప్రయోగాల వల్ల విమానాలు, నౌకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని జపాన్ అధికారి తెలిపారు. ఉత్తర కొరియా హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించి ఉండవచ్చని జపాన్ వర్గాలు అనుమానిస్తున్నాయి. అయితే ఈ అంశంపై స్పష్టమైన నిర్ధారణ వెలువడలేదు. అణ్వాయుధాలను ప్రయోగించగల సామర్థ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఉత్తర కొరియా చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. తాజా క్షిపణి పరీక్షల నేపథ్యంలో ప్రాంతీయ భద్రత, కొరియా దేశాల మధ్య సంబంధాలపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

తిరుపతికి మహర్దశ..

మొదటి తరువాయి

వసతులను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

అత్యంత కీలకమైన ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్...

ఈ ప్రాజెక్టులలో అత్యంత కీలకమైనది ఇంటిగ్రేటెడ్ పిలిగ్రిమ్ టౌన్‌షిప్. తిరుమల కొండపై రద్దీని తగ్గించే లక్ష్యంతో కొండ కిందనే భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో నాలుగు బ్లాకుల్లో 2,700 గదుల వసతి సముదాయాలను నిర్మించనున్నారు. దీనివల్ల రోజుకు సుమారు 15 వేల మంది భక్తులకు వసతి అందుబాటులోకి వస్తుంది.

రూ.160 కోట్లతో భారీ అన్నప్రసాద కేంద్ర నిర్మాణం

అలాగే, ఒకేసారి 6 వేల మందికి అన్నప్రసాదం అందించేలా రూ.160 కోట్లతో భారీ అన్నప్రసాద కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. రూ.486 కోట్లతో నిర్మించే నాలుగు పిలిగ్రిమ్ ఎమినిటీస్ కాంప్లెక్స్‌లలో ఒకేసారి 16 వేల మంది భక్తులు స్నానం, విశ్రాంతి తీసుకునే సౌకర్యం కలుగుతుంది. వీటితో పాటు రూ.311 కోట్లతో 4,500 వాహనాలకు సరిపడా బహుళ అంతస్తుల పార్కింగ్, రూ.90 కోట్లతో 30 బస్ బేలతో కూడిన ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ టెర్మినల్ కూడా ఈ టౌన్‌షిప్‌లో భాగమే.

దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు

మరోవైపు, టీటీడీ ఉద్యోగుల దశాబ్దాల కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేసింది. 418 ఎకరాల విస్తీర్ణంలో రెండు దశల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాలను కేటాయించేందుకు లేఅవుట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఅవుట్‌లో అంతర్గత బీటీ రోడ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా, విద్యుత్ వంటి మౌలిక వసతుల కల్పనకు రూ.230 కోట్లు వెచ్చించనున్నారు.

నగర అభివృద్ధిలో భాగంగా....

తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రూ.242 కోట్ల వ్యయంతో 9 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణానికి కూడా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ఈ సమగ్ర అభివృద్ధి ప్రణాళికతో తిరుపతి రూపురేఖలు మారి, ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధి చెందుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

రైతుల సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ నేతలు!

-ఎరువుల కొరత, విద్యుత్ కోతలతో రైతులకు ఇబ్బందులు..

-ఎండుతున్న పంటలకు పరిహారం చెల్లించాలి

-బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

-కొందుర్గులో బీఆర్ఎస్ మీడియా సమావేశం..

-రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఎండిపోతున్న పంటలు, విద్యుత్ కోతలు, ఎరువుల కొరత తదితర అంశాలపై బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని జి.ఎం. పటేల్ మినీ గార్డెన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాల కొరత, విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పంటలు ఎండిపోతున్నా రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తగిన ఉపశమన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. తెలంగాణ నదీ జలాలను ఆంధ్రప్రదేశ్‌కు తరలించుకుపోతున్నారని ఆరోపిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు.
షాద్‌నగర్ ఎమ్మెల్యే తెలంగాణ ఉద్యమకారుల పట్ల, తెలంగాణ జాతిపితగా తాము భావించే కేసీఆర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. హైదరాబాద్‌లో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని, మరోవైపు బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి మన్నె క్రిశాంక్‌ను అరెస్టు చేసి, దుస్తులు విప్పించి జైలుకు పంపించారని విమర్శించారు. ఈ వ్యవహారంలో పోలీసుల వ్యవహారశైలిపై ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలు పెరిగాయని, ప్రజలు ప్రభుత్వ పనితీరును గమనిస్తున్నారని అన్నారు. రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీఆర్ఎస్ సభ్యత్వ నమోదును చురుగ్గా చేపట్టాలని, పార్టీ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎండిన పంటలను పరిశీలించి రైతులకు పరిహారం అందించాలిమాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎరువుల కొరత, విద్యుత్ కోతలు, ఎల్‌నినో ప్రభావం వంటి సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రైతుబంధు పథకం అమలుపైనా విమర్శలు చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల పొలాలను సందర్శించి, ఎండిపోయిన పంటలను పరిశీలించి, నష్ట వివరాలతో నివేదికలు రూపొందించాలని కోరారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని అంజయ్య యాదవ్ విమర్శించారు. ప్రభుత్వం మిగిలిన కాలంలోనైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సూచించారు. రైతుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన సహకారం అందించాలని కోరారు.
ఈ సమావేశంలో కొందుర్గు సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మన్నె కవిత నారాయణ యాదవ్, బీఆర్ఎస్ మండల, మున్సిపల్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, హాఫీజ్, నటరాజన్, లక్ష్మణ్ నాయక్, మాజీ జడ్పీటీసీ బంగారు రాములు, మాజీ ఎంపీపీ తనయుడు పోతురాజు గోపాల్, సర్పంచులు మోహనచారి, సోని శేఖర్, నాయకులు కొండి యాదయ్య, వెంకటేష్, సత్య ప్రమోద్ పంతులు, దానగల్ల రాములు, ఆకుల మానయ్య, రెడ్డి నర్సింలు, దర్గా రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరయ్యారు.

జీవో నెంబర్ 25ను వెంటనే సవరించాలి

- ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి ఉస్మాన్ అలీ

జర్నలిస్ట్ డైరీ పరిగి అక్టోబర్ 12
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి జీవో 25ను వెంటనే సవరించి, ఉపాధ్యాయ–విద్యార్థుల నిష్పత్తిని 1:20గా అమలు చేయాలని ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ (PSHMA-TG) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ ఉస్మాన్ అలీ డిమాండ్ చేశారు. పాఠశాలల్లో 20 మంది విద్యార్థులకు ఇద్దరు, 40 మందికి ముగ్గురు, 50 మందికి నలుగురు చొప్పున టీచర్లను కేటాయించాలని కోరారు. అలాగే 50 మంది దాటితే తరగతికో ఉపాధ్యాయుడిని, 60 మంది దాటిన బడుల్లో ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ (PSHM)ను, 80 మంది దాటితే వ్యాయామ ఉపాధ్యాయుడిని (PET) తక్షణమే నియమించాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు మరియు సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించిన గాంధీ.

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు మరియు సిబ్బంది వసతి గృహాన్ని తాజా మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాస రావు, దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హెచ్ఎంటీ శాతవాహన నగర్ కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన దుకాణాలు మరియు సిబ్బంది వసతి గృహాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని, సిబ్బంది కి వసతి కల్పించడం గొప్ప విషయం అని, నేటితో అందుబాటులోకి రావడం జరుగుతుంది అని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ శాతవాహన నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులైన అధ్యక్షులు రీ పి. రత్న ప్రసాద్ గారు, ఉపాధ్యక్షులు ఎం. బాబు రావు , ప్రధాన కార్యదర్శి ఎం. యాది రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు వి. వెంకట రావు మరియు ఎస్. రామనాథం తో పాటు, హెచ్ఎంటీ శాతవాహన నగర్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు మరియు శ్రీ ఉమా మహేశ్వర ఆలయ కార్యవర్గ సభ్యులు మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి

నవరాత్రి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న విష్ణువర్ధన్ రెడ్డి

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
షాద్‌నగర్ పట్టణంలోని కోట మైసమ్మ దేవాలయంలో నిర్వహించిన దసరా నవరాత్రి ఉత్సవాల్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి తన సతీమణి రమాదేవి, తల్లిదండ్రులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి పర్వదినాల్లో అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు మన సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకలని, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు సమాజంలో భక్తిభావాన్ని, ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భక్తులందరూ ఐకమత్యంతో పండుగలను నిర్వహించుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతుందని అన్నారు. అనంతరం ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు పేదలకు, భక్తులకు తోడ్పాటునందించడంతో పాటు సమాజంలో సేవాభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. అమ్మవారి కృపతో ప్రజల జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభాగ్యం వెల్లివిరియాలని, షాద్‌నగర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, విజయ భాస్కర్, మోహన్ సింగ్, సుధాకర్ అప్ప, చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి, వంశీకృష్ణ, లష్కర్ నాయక్, శ్యాంసుందర్ రెడ్డి, మఠం రిషికేష్, కృష్ణ యాదవ్, గంగాధర్, శ్రీనివాస్ చారి, అనిల్ కుమార్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, చౌడం శ్రీనివాస్‌తో పాటు భవానీ దీక్షాదారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ బైపాస్‌లో కాలి బూడిదైన ఈవీ కారు.. నలుగురి సజీవ దహనం

-విజయవాడ పశ్చిమ బైపాస్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
-ప్రమాదం అనంతరం ఈవీ కారులో చెలరేగిన మంటలు
-ఘటనా స్థలంలోనే నలుగురు మృతి,
-మరొకరి పరిస్థితి విషమం
నంబూరులో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన దుర్ఘటన
-మృతులు నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తింపు

విజయవాడ,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
విజయవాడ నగర శివార్లలోని పశ్చిమ బైపాస్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో నలుగురు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. వారు ప్రయాణిస్తున్న ఎలక్ట్రిక్ కారు (ఈవీ) ప్రమాదానికి గురైన వెంటనే మంటల్లో చిక్కుకుని పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ఘటనలో మరొకరు తీవ్ర గాయాలతో బయటపడగా, ఆయన పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు అందించిన ప్రాథమిక సమాచారం ప్రకారం,
మృతులను నున్న, నంబూరు ప్రాంత వాసులుగా గుర్తించారు. వీరంతా నంబూరులో జరిగిన ఒక ఫంక్షన్‌కు హాజరై తిరిగి తమ ఇళ్లకు పయనమవుతుండగా ఈ విషాదం జరిగింది. వేగంగా ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి ప్రమాదానికి గురై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో లోపల ఉన్నవారు బయటకు వచ్చే అవకాశం లేకుండా పోయింది.
కన్నీరుమున్నీరుగా విలపించిన బంధువులు...సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద వార్త తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. వారి ఆక్రందనలతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

హైదరాబాద్‌లో ఘనంగా ‘అగ్ని గవాక్షం’ కవిత్వ పుస్తకావిష్కరణ సభ

తెలంగాణ బ్యూరో, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, సాహితీ కళాభారతి ఆధ్వర్యంలో ప్రముఖ కవి హరీష్ కుమార్ శర్మ రచించిన “అగ్ని గవాక్షం” కవిత్వ పుస్తకావిష్కరణ సభ హైదరాబాద్‌లోని రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సాహితీవేత్త శ్రీ దాస్యం సేనాధిపతి సభాధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, సినీ గేయరచయిత మౌనశ్రీ మల్లిక్ ముఖ్య అతిథిగా విచ్చేసి, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుస్తక ఆవిష్కర్త మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ... సమాజం హితం గూర్చి నిరంతరం చేసే ఆలోచనలే కవిత్వాలుగా ఆవిష్కరించబడతాయని అటువంటి సమాజహితకారి హరీశ్ శర్మ అని కొనియాడారు. ప్రపంచాన్ని మార్పు దిశగా నడిపించేది కవిత్వమొక్కటే అన్నారు. సమాజానికి ఆదర్శంగా ఉండే కవి యొక్క కవిత్వమే విలువను పొందుతుందన్నారు. సమాజాన్ని తాత్విక దృష్టి తో చూస్తూ అంతే తాత్వికతను ఈ పుస్తకం ద్వారా సమాజానికి అందించిన సార్థక కవి హరీశ్ శర్మ అన్నారు. కవిత్వం అనేది ఒక ప్రత్యేకమైన భాష అని పేర్కొన్నారు. భాష నేర్చిన భావుకుడు హరీష్ శర్మ అంటూ నిరంతరం కవితా సేద్యం కొనసాగాలని..



ఆశీర్వదిస్తూ మరిన్ని పుస్తకాలను వెలువరించాలని ఆకాంక్షించారు. అదే విధంగా అతిథులందరూ అభినందించారు, సమాజానికి మేల్కొలుపునిచ్చేలా హరీష్ కుమార్ శర్మ గారు రాసిన కవితలు ఎంతో ఆలోచనాత్మకంగా ఉన్నాయని ప్రశంసించారు.
అతిథిగా ప్రముఖ సాహితీవేత్త శ్రీమతి శైలజామిత్ర గారు పాల్గొని గ్రంథ విశేషాలను కొనియాడారు.
ప్రముఖ కవి, కథారచయిత పెద్దూరి వెంకటదాస్ రచయితకు శుభాకాంక్షలు తెలియజేయగా, విశిష్ట అతిథులుగా పాతూరి వెంకట్రావు, రజనీ సాయిచంద్, ఇతర అతిథులు శ్రీ మదన్ మోహన్ రెడ్డి, తూర్పు మల్లా రెడ్డి పుస్తక విశేషాలను కొనియాడారు
.పుస్తకావిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఇతిహాస సంకలన సమితి ఆధ్వర్యంలో ప్రదర్శించిన ‘ముసునూరు నాయకులు’ చారిత్రక నాటక ప్రదర్శన వీక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సభకు నగరంలోని సాహితీప్రియులు, కవులు, రచయితలు మరియు హరీష్ కుమార్ శర్మ శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఏపీ మేయర్ ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు.. విశాఖకు మహిళ, విజయవాడ అన్‌రిజర్వ్‌డ్

-ఆంధ్రప్రదేశ్‌లోని 17 కార్పొరేషన్లకు మేయర్ రిజర్వేషన్లు ఖరారు

-ఈ మేరకు పురపాలక శాఖ నుంచి జీవో నెం. 252 జారీ

-5 బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ, 5 జనరల్ మహిళలకు కేటాయింపు

-విజయవాడ, తిరుపతి సహా 4 స్థానాలు అన్‌రిజర్వ్‌డ్‌గా ప్రకటన

-త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల దిశగా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రంలోని 17 మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్ పదవుల రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ జీవో నెం. 252ను జారీ చేసింది. దీని ప్రకారం వివిధ సామాజిక వర్గాలకు, మహిళలకు కేటాయింపులు జరిగాయి.

మొత్తం 17 కార్పొరేషన్లలో ..

రాష్ట్రంలోని మొత్తం 17 కార్పొరేషన్లలో 5 స్థానాలను బీసీలకు, 2 ఎస్సీలకు, 1 ఎస్టీకి కేటాయించారు. మరో 5 కార్పొరేషన్లను జనరల్ కేటగిరీ మహిళలకు రిజర్వ్ చేయగా, మిగిలిన 4 స్థానాలను అన్‌రిజర్వ్‌డ్‌గా (రిజర్వేషన్ లేనివి) ప్రకటించారు. ఈ రిజర్వేషన్ల ఖరారుతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుందని భావిస్తున్నారు.

రిజర్వేషన్ల కేటాయింపు వివరాలు...

ఎస్టీ (ఒకటి): మంగళగిరి–తాడేపల్లి
ఎస్సీ (రెండు): రాజమహేంద్రవరం, కర్నూలు
బీసీ – మహిళ (రెండు): మచిలీపట్నం, కాకినాడ
బీసీ – జనరల్ (మూడు): అనంతపురం, చిత్తూరు, ఏలూరు
జనరల్ – మహిళ (ఐదు): విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, కడప, విశాఖపట్నం
అన్‌రిజర్వ్‌డ్ (నాలుగు): తిరుపతి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు

తాజా నోటిఫికేషన్ పరిశీలిస్తే...

ఈ తాజా నోటిఫికేషన్‌తో ప్రధాన నగరాలైన విశాఖపట్నం, గుంటూరు మేయర్ పీఠాలు మహిళలకు దక్కనుండగా, విజయవాడ, తిరుపతి వంటి కీలక కార్పొరేషన్లు అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్నాయి. మేయర్ పదవుల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తికావడంతో, త్వరలోనే ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత వచ్చే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి

తొర్రూరు-జగద్గిరిగుట్ట ఆర్టీసీ బస్సులో డ్రైవర్ నిర్లక్ష్యం!

-బస్సు నడుపుతూ సెల్‌ఫోన్‌లో మాటలు.. చేతులు వదిలి డ్రైవింగ్ చేసినట్లు ఆరోపణలు

-ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమా? ఆర్టీసీ అధికారులు స్పందించాలి!

జర్నలిస్ట్ డైరీ న్యూస్ బ్యూరో చీఫ్ ప్రత్యేక కథనం

తొర్రూరు నుంచి జగద్గిరిగుట్టకు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ వ్యవహారం ప్రయాణికుల భద్రతపై ఆందోళన కలిగిస్తోంది.బస్సు నడుపుతూనే డ్రైవర్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, చేతులు వదిలి డ్రైవింగ్ చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత కలిగిన డ్రైవర్ ఇలా వ్యవహరిస్తే, బస్సులో ప్రయాణిస్తున్న వారి ప్రాణాలకు భరోసా ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.బస్సులో పదుల సంఖ్యలో ప్రయాణికులు ఉన్నప్పుడు డ్రైవర్ రహదారిపై పూర్తి దృష్టి సారించాలి. కానీ ఫోన్‌లో మాట్లాడుతూ, చేతులు వదిలి బస్సు నడపడం నిజమే అయితే అది ప్రమాదకరమైన నిర్లక్ష్యమే. క్షణకాలం అజాగ్రత్త జరిగినా ప్రయాణికులతో పాటు ఇతర వాహనదారుల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

సామాన్యులకే నిబంధనలా.. బస్సు డ్రైవర్లకు వర్తించవా?

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన సాధారణ వాహనదారులపై అధికారులు చర్యలు తీసుకుంటారు. మరి ప్రజా రవాణా బస్సును నడుపుతూ ప్రమాదకరంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న డ్రైవర్ విషయంలో ఏం చేస్తారు? ప్రజల ప్రాణాలకు బాధ్యత వహించే డ్రైవర్లు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం లేదా? అనే ప్రశ్నలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ అధికారులు వెంటనే విచారణ చేపట్టాలి!

తొర్రూరు--జగద్గిరిగుట్ట మార్గంలో నడిచిన ఈ బస్సుకు సంబంధించిన వివరాలను సేకరించి, ఘటనపై సంబంధిత ఆర్టీసీ అధికారులు విచారణ జరపాలి.అందుబాటులో ఉన్న వీడియోలు, ఇతర ఆధారాలను పరిశీలించి ఆరోపణల్లో నిజానిజాలను నిర్ధారించాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ప్రయాణికుల ప్రాణాలు ముఖ్యం.. నిర్లక్ష్యానికి అడ్డుకట్ట ఎప్పుడు?ఆర్టీసీ బస్సు అంటే ప్రజలు నమ్మకంతో ప్రయాణించే ప్రజా రవాణా సాధనం. ఆ నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆర్టీసీ యాజమాన్యంపై ఉంది.ప్రమాదం జరిగిన తర్వాత విచారం వ్యక్తం చేయడం కంటే, ప్రమాదాలకు దారితీసే నిర్లక్ష్యాన్ని ముందుగానే అరికట్టడం ముఖ్యం. ఈ వ్యవహారంపై ఆర్టీసీ యాజమాన్యం, సంబంధిత అధికారులు స్పందించి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పిస్తారా? అన్నది వేచి చూడాలి.

శేరిలింగంపల్లిలో రూ.1.61 కోట్లతో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ

రంగారెడ్డి జిల్లా బ్యూరో, అక్టోబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) : మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్, హరిజన బస్తీ, మెగా హిల్స్ ,అయ్యప్ప సొసైటీ కాలనీలో రూ.1 కోటి 61 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు మరియు మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు జలమండలి అధికారులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపన చేసిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మెరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవ తో ఈ రోజు సుభాష్ చంద్రబోస్ నగర్, హరిజన బస్తీ, మెగా హిల్స్ ,అయ్యప్ప సొసైటీ కాలనీలోరూ.1 కోటి 61 లక్షల 50 వేల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు మరియు మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేసుకోవడం చాలా సంతోషకరమైన విషయం అని తెలియచేసారు,అత్యవసరం ఉన్న చోట , నిత్యం పొంగుతున్న ప్రాంతలలోప్రథమ ప్రాధాన్యత గా పనులు పూర్తి చేస్తామని తెలియచేశారు. ఏ చిన్న సమస్య అయిన నా దృష్టికి వచ్చిన తప్పకుండా పరిష్కరిస్తామని, కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ ,కాలనీలను అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతు సమస్య రహిత ఆదర్శవంతమైన కాలనీ లు గా తీర్చిదిద్దడమే నా ప్రథమ లక్ష్యం అని తెలియచేసారు. కాలనీలలో గల ఎన్నో ఏండ్ల సమస్య నేటి తో తిరునని, నిత్యం పొంగుతుండటం వలన కాలనీ వాసులు , ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు అని వాటిని దృష్టిలో పెట్టుకొని ఈ రోజు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయడం జరిగినది అని, అదేవిధంగా ప్రతి కాలనీ లో స్వచ్ఛమైన మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం ద్వారా కాలనీ వాసులకు ప్రజలకు, స్వచ్చైమన మంచి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ మంచి నీటి పైప్ లైన్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని ,నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని చెప్పడం జరిగినది. పనుల్లో జాప్యం లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించడం జరిగినది , నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, అదేవిధంగా సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకం లో శేరిలింగంపల్లి నియోకజకర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన ,అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదితానని తెలియచేసారు.

అభివృద్ధి/ శంకుస్థాపన చేసిన పనుల వివరాలు

1.మాదాపూర్ డివిజన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్ కాలనీలో రూ.49.50 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు
2.మాదాపూర్ డివిజన్ పరిధిలోని హరిజన బస్తీ లో రూ.40.00 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే మంచి నీటి పైప్ లైన్ నిర్మాణం పనులకు
3.మాదాపూర్ డివిజన్ పరిధిలోని మెగా హిల్స్ కాలనీ లో రూ.30.00 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌడ్ డ్రైనేజీ(ఖ+ఊ) పైప్ లైన్ నిర్మాణం పనులకు.
4.మాదాపూర్ డివిజన్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ కాలనీ లో రూ.42.00 లక్షల రూపాయల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే అండర్ గ్రౌడ్ డ్రైనేజీ పైప్ లైన్ నిర్మాణం పనులకు

ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు డిజియం నరేందర్ మేనేజర్లు సలోమి,విక్రమ్ రెడ్డి మరియు నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, స్థానికవాసులు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి 'గ్రానైట్ వ్యర్థాల' 'శాశ్వత పునర్వినియోగానికి' ప్రకాశం జిల్లా 'కలెక్టర్' వినూత్న 'చొరవ'

-పర్యావరణ పరిరక్షణ మరియు వ్యర్థాల ద్వారా వినియోగంలో లేని భూములను.. వినియోగం లోకి తీసుకురావటమే లక్ష్యం

-భోపాల్ లోని కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ డైరెక్టర్ తో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



ఒంగోలు, ప్రకాశం బ్యూరో జర్నలిస్ట్ డైరీ : జిల్లాలోని సహజ ప్రకృతి వనరులను పరిరక్షిస్తూ, పర్యావరణ పరిరక్షణకు మరియు పారిశ్రామిక అభివృద్ధికి నడుమ సమతుల్యత సాధించేందుకు ప్రకాశం జిల్లా యంత్రాంగం సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టింది. సుమారు నాలుగు దశాబ్దాలుగా జిల్లాలోని చీమకుర్తి పరిసర ప్రాంతాలలో విస్తరించి ఉన్న ప్రసిద్ధ గ్రానైట్ గనులు, క్వారీలు మరియు పాలిషింగ్ పరిశ్రమల ద్వారా నిత్యం వెలువడుతున్న వ్యర్థాల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ?ఈ బృహత్తర ప్రణాళికను ఆచరణలోకి తీసుకువచ్చే క్రమంలో సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పరిశోధనా సంస్థ (సిఎస్ఐఆర్ – ఏఎంపిఆర్ఐ) డైరెక్టర్ తో జిల్లా కలెక్టర్ ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.?ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు మాట్లాడుతూ, గత నాలుగు దశాబ్దాలుగా చీమకుర్తి కేంద్రంగా నడుస్తున్న భారీ గ్రానైట్ పరిశ్రమల వల్ల వెలువడే వ్యర్థాల నిర్వహణ ఒక ప్రధాన సవాలుగా మారిందని పేర్కొన్నారు. గ్రానైట్ పాలిషింగ్ ప్రక్రియలో వైట్ లిక్విడ్ రూపంలో నిత్యం టన్నుల కొద్దీ ఉత్పత్తి అయ్యే తడి వ్యర్థాలు (గ్రానైట్ స్లర్రీ) మరియు పాలిషింగ్ సమయంలో వచ్చే రాతి ముక్కలు, ఇతర ఘన వ్యర్థాలు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యర్థాలు పెద్ద ఎత్తున నిల్వ ఉండటం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూములు వ్యర్థాల దిబ్బలుగా మారి దుర్వినియోగం అవ్వడమే కాకుండా, ఎండిన స్లర్రీ నుండి వచ్చే ధూళి మరియు నీటి కాలుష్యం వల్ల స్థానిక పర్యావరణ సమతుల్యత దెబ్బ తింటోందని వివరించారు.?ఈ క్లిష్టమైన పర్యావరణ మరియు భూసమస్యల పరిష్కారానికి సైంటిఫిక్ అప్రోచ్ (శాస్త్రీయ విధానం) అవసరమని భావించిన కలెక్టర్ సీఎస్ఐఆర్ – ఏఎంపిఆర్ఐ మరియు సైంటిస్టుల బృందాన్ని సంప్రదించారు. చీమకుర్తి లోని క్వారీలు మరియు పాలిషింగ్ యూనిట్ల నుండి ఉత్పత్తవుతున్న ఈ స్లర్రీ, రాతి వ్యర్థాల పైన సమగ్రమైన పరిశోధన నిర్వహించాలని వారిని కోరారు. ఆ పరిశోధనా ఫలితాల ఆధారంగా ఈ వ్యర్థాలను ఇతర రకాల పర్యావరణహిత నిర్మాణ సామగ్రిని, ప్రత్యామ్నాయ ఉత్పత్తులుగా ఏ విధంగా మార్చవచ్చో సమగ్ర నివేదికను, తగిన మార్గదర్శకాలను అందించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపడతామన్న కలెక్టర్

సాంకేతిక ఆధారిత పరిశోధన పూర్తయిన తర్వాత, వారి ఇచ్చే సూచనలు మరియు వినూత్న పద్ధతుల మేరకు జిల్లా వ్యాప్తంగా వ్యర్థాల నిర్వహణ చర్యలు చేపడతామని కలెక్టర్ తెలియజేశారు. దీని ద్వారా కాలుష్యాన్ని పూర్తిగా నివారించడమే కాకుండా, వ్యర్థాలతో కప్పడిపోయిన విలువైన ల్యాండ్ (భూమి)ని తిరిగి పూడ్చి వేరే ఉపయోగకరమైన కార్యక్రమాలకు వినియోగం లోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మైన్స్ అండ్ జియాలజీ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ / ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ శ్రీ మదన్ మోహన్, మరియు జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ హఠావో-జెమ్లా తాండా బచావో

నారాయణఖేడ్,అక్టోబర్ 12 జర్నలిస్ట్ డైరీ : సిర్గాపూర్ మండలం జెమ్లానాయక్ తండా వద్ద ఏర్పాటు చేస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ తొలగించి తాండాను కాపాడాలని గ్రామ సర్పంచ్ విస్లావత్ పార్వతి ఆధ్వర్యంలో తాండా వాసులు సోలార్ ప్లాంట్ హఠావో తాండాను బచావో అంటూ సోమవారం నిరాహార దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అనేక ఏళ్ల క్రితమే తాండా పెద్దలు భూమి యజమానులకు డబ్బులు చెల్లించి సాదా బైనామాలపై సంతకాలు తీసుకొని పక్క ఇళ్ళు నిర్మించుకొని జీవిస్తున్నాము అన్నారు.కొందరు వ్యక్తులు బినామీగా మారి మేము కొనుగోలు చేసిన భూములను తమ ఆధీనంలోకి తీసుకొని సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు అన్నారు.సోలార్ ఏర్పాటు సందర్భంగా సర్పంచ్,ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు,తాండా వాసులకు ఎటువంటి సమాచారం ఇవ్వలేరు అన్నారు.సోలార్ ఏర్పాటు వల్ల పక్కనే ఉన్న తాండాకు,ప్రజలకు హానీ

కూడా జరిగే ప్రమాదం ఉందని అన్నారు.గత 50 ఏళు _గా తాము సాగు చేసుకుంటున్న భూములను సోలార్ ప్రాజెక్ట్ పేరుతో లాక్కోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు.సబ్ కలెక్టర్,తహసీల్దార్ ఇతర అధికారులకు విన్నవించిన ఫలితం లేకుండా పోయింది కాబట్టి సోలార్ ను తొలగించి తాండాను రక్షించాలని నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది అన్నారు.తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు.తాండావాసులు చేపట్టిన నిరాహారా దీక్ష శిబిరం వద్దకు ఎస్సై మహేష్ చేరుకొని దీక్షకు గల కారణాలు అడిగి,భూమికి సంబందించిన ధ్రువీకరణ పత్రాలు ఉంటే చూపించాలని,సమస్యను ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్తాను అన్నారు.ఈ కార్యక్రమంలో తాండా వాసులు తుకారం పవర్, విశ్వనాథ్, హరినాయక్,విశ్వనాథ్,పండరీ నాయక్, నారాయణ నాయక్,చంద్ర నాయక్,శీను నాయక్, పరశురాం జ్యోతిబాయి, అరు భాయి,శాంతిభాయి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ప్రతి గ్రీవెన్స్ 'అర్జీ' పట్ల అధికారులు అత్యంత 'బాధ్యతాయుతం'గా వ్యవహరించాలి

-ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోగా ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలి

-జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి

-ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 142 అర్జీలు

ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఒంగోలు నగరంలోని ప్రకాశం భవనంలో గల పీజీఆర్ఎస్ హాల్ లో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ముగిసింది. ఈ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి హాజరై, ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా విచ్చేసిన బాధితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, జాయింట్ కలెక్టర్ వారితో ఓపికగా మాట్లాడి సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 142 అర్జీలు నమోదయ్యాయి. అధికారులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీ పట్ల అధికారులు అత్యంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువు లోపలే ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని స్పష్టం చేశారు. అర్జీలను కేవలం సాంకేతిక కారణాలతో తిరస్కరించడం సరికాదని, ప్రతి అర్జీనీ క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా సమగ్రంగా విచారించి బాధితులకు పూర్తి స్థాయి సంతృప్తినిచ్చేలా నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని ఆమె ఆదేశించారు.?ఒకే సమస్యపై ప్రజలు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం రాకూడదని, పునరావృతం అయ్యే ఫిర్యాదులు లేకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, స్థానిక సంస్థలు మరియు ఇతర సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదయ్యే ఫిర్యాదుల పురోగతిని తాను క్రమం తప్పకుండా సమీక్షిస్తానని, విధుల్లో అశ్రద్ధ వహించే అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిఆర్.వెంకట రమణ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి మాధురి, బీసీ కార్పొరేషన్ ఈడి జి. వెంకటేశ్వర రావుల తో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ కు పిర్యాదు

నారాయణఖేడ్,అక్టోబర్ 12 జర్నలిస్ట్ డైరీ : మండల పరిధిలోని పోతన్ పల్లి(ఎం) గ్రామానికి చెందిన బిజెపి పార్టీ ఉప సర్పంచ్ పండరి గ్రామ సర్పంచ్ భర్త సంఘమేశ్వర్ మీద సోమవారం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఎన్.ఉమాహారతికి పిర్యాదు చేశారు.గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు నాసిరకంగా,నాణ్యత రహితంగా ఉన్నందున బిల్లులపై సంతకాలు పెట్టనని చెప్పినందున సర్పంచ్ భర్త తనపై దాడులకు పాల్పడుతున్నాడు అన్నారు.గ్రామ అభివృద్ధి పనులకు ఇసుక కాకుండా పూర్తిగా డస్ట్ తో చేపడుతున్నారని,నాణ్యత రహితంగా ఉంటే తొందరగా పాడవుతాయని నాణ్యతంగా ఉంటేనే చెక్కులపై సంతకాలు పెడతాను అన్నందుకు సాధారణ సమావేశం జరుగుతుండగా గ్రామ పంచాయతీ కార్యాలయంలోకి వచ్చి సభ్యుల ముందే దాడికి పాల్పడ్డాడు అన్నారు.భార్య సర్పంచ్ ఉంటే భర్త అన్ని తానై గ్రామ పరిపాలనలో జోక్యం చేసుకుంటున్నాడని,పెత్తనం చలాయిస్తున్న పంచాయతీ కార్యదర్శి కూడా చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారు కాబట్టి సర్పంచ్ భర్త మరియు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి అని పిర్యాదు చేశారు. ఆయనతో పాటు మాజీ సర్పంచ్ రాములు తదితరులు ఉన్నారు.

ప్రతి పట్టభద్రుడిని ఓటరు జాబితాలో చేర్చాలి

మక్తల్ ఎమ్మెల్సీ బీజేపీ ఇన్‌చార్జి బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

నారాయణపేట, అక్టోబర్ 12 జర్నలిస్ట్ డైరీ అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరు జాబితాలో నమోదు చేసి, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని మక్తల్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి కార్యకర్తలకు సూచించారు. సోమవారం అమరచింత రూరల్ మండలంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, అర్హులైన పట్టభద్రులను గుర్తించి దరఖాస్తులు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. గతంలో ఓటు వేసిన పట్టభద్రులు సైతం కొత్తగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మల్లారెడ్డి, భరత్ సింహారెడ్డి, కుర్మారెడ్డి, నర్సింహారెడ్డి, కావలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీ స్థానిక ఎన్నికలు.. మున్సిపాలిటీల రిజర్వేషన్లు ఖరారు

-ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ ఎన్నికలకు రిజర్వేషన్లకు తుది రూపు

-మొత్తం 106 మున్సిపాలిటీలు, -17 కార్పొరేషన్లకు తుది జాబితా విడుదల

-మున్సిపాలిటీలలో బీసీలకు 35, ఎస్సీలకు 14, ఎస్టీలకు 3 చైర్మన్ పీఠాలు

-అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు 50 స్థానాలు కేటాయింపు

-రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది

అమరావతి,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న పురపాలక ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 106 మున్సిపాలిటీలు, 17 మున్సిపల్ కార్పొరేషన్లలో ఛైర్మన్, మేయర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ సోమవారం తుది జాబితాను ప్రకటించింది. ఈ ప్రకటనతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో ఒక ముఖ్యమైన ఘట్టం పూర్తయింది. ఇక అన్ని రాజకీయ పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించేందుకు మార్గం సుగమమైంది.

ప్రకటించిన జాబితా ప్రకారం,

106 మున్సిపాలిటీలలో ఛైర్మన్ పదవులకు గాను బీసీ (వెనుకబడిన తరగతులు) వర్గానికి 35 స్థానాలు, ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) వర్గానికి 14 స్థానాలు, ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) వర్గానికి 3 స్థానాలు కేటాయించారు. అన్ని కేటగిరీలలో కలిపి మహిళలకు మొత్తం 50 స్థానాలు రిజర్వ్ చేయడం గమనార్హం. కేటగిరీల వారీగా రిజర్వ్ చేయబడిన పురపాలక సంఘాల పూర్తి వివరాలు కింద ఇవ్వబడ్డాయి.

కేటగిరీల వారీగా పురపాలక సంఘాల జాబితా

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు) – 3

ఎస్టీ – మహిళ: గూడూరు

ఎస్టీ – జనరల్: ఆత్మకూరు, ఆలూరు

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) – 14

ఎస్సీ – మహిళ: కొండపల్లి, నిడదవోలు, యలమంచిలి, చింతలపూడి, సూళ్లూరుపేట, గుత్తి, చీరాల.

ఎస్సీ – జనరల్: ఉయ్యూరు, నూజివీడు, కుప్పం, సామర్లకోట, పిఠాపురం, బాపట్ల, పొదిలి.

బీసీ (వెనుకబడిన తరగతులు) – 35

బీసీ – మహిళ: జంగారెడ్డిగూడెం, నర్సీపట్నం, నాయుడుపేట, చిలకలూరిపేట, ఇచ్ఛాపురం, కొవ్వూరు, పాలకొల్లు, గుంతకల్, గుడివాడ, నందిగామ, ముమ్మిడివరం, మదనపల్లె, నరసరావుపేట, అమలాపురం.

బీసీ – జనరల్: కావలి, కదిరి, బి.కొత్తకోట, కందుకూరు, హిందూపురం, ఆత్మకూరు (నెల్లూరు), అద్దంకి, కమలాపురం, నెల్లిమర్ల, మడకశిర, ఆళ్లగడ్డ, గురజాల, దాచేపల్లి, గొల్లప్రోలు, మార్కాపురం, నంద్యాల, బేతంచెర్ల, నందికొట్కూరు, దర్శి, గూడూరు (కర్నూలు), మైదుకూరు, బద్వేల్.

జనరల్ కేటగిరీ (మహిళ)

ఈ కేటగిరీ కింద మొత్తం 27 మున్సిపాలిటీలను మహిళలకు కేటాయించారు.

కనిగిరి, వెంకటగిరి, నరసాపురం, పలాస–కాశీబుగ్గ, పెడన, పలమనేరు, జమ్మలమడుగు, ఆకివీడు, పాలకొండ, పొన్నూరు, భీమవరం, జగ్గయ్యపేట, బుచ్చిరెడ్డిపాలెం, యర్రగుంట్ల, యలమంచిలి, కళ్యాణదుర్గ్, ఆమదాలవలస, పుంగనూరు, మాచర్ల, రాజంపేట, ఆదోని, డోన్, రాజాం, బొబ్బిలి, రేపల్లె, పులివెందుల, ఎమ్మిగనూరు.

అన్ రిజర్వ్ (జనరల్)

కింది 26 మున్సిపాలిటీలు ఏ రిజర్వేషన్ పరిధిలోకి రాకుండా అన్‌రిజర్వ్‌గా ఉన్నాయి.

పుట్టపర్తి, పెనుకొండ, రాయచోటి, సాలూరు, తాడేపల్లిగూడెం, తణుకు, తెనాలి, రామచంద్రాపురం, సత్తెనపల్లె, శ్రీకాళహస్తి, తుని, పార్వతీపురం, ప్రొద్దుటూరు, పుత్తూరు, మండపేట, నగరి, చీమకుర్తి, తిరువూరు, రాయదుర్గ్, గిద్దలూరు, వినుకొండ, పెద్దాపురం, ధర్మవరం, తాడిపత్రి, పిడుగురాళ్ల. ఈ అధికారిక ప్రకటన వెలువడటంతో, మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఈ రిజర్వేషన్ల ఆధారంగా ప్రధాన రాజకీయ పక్షాలు తమ వ్యూహాలకు పదునుపెట్టడం, బలమైన అభ్యర్థులను నిలబెట్టేందుకు కసరత్తులు ప్రారంభించనున్నాయి. రాబోయే రోజుల్లో పురపాలక రాజకీయాలు మరింత వేడెక్కనున్నాయి.

పడకల్ సమస్యల పరిష్కారానికి పాదయాత్ర

ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం

తలకొండపల్లి, అక్టోబర్ 12 జర్నలిస్ట్ డైరీ : రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం పడకల్ ఉమ్మడి గ్రామపంచాయతీ సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామస్తులు పడకల్ నుంచి తలకొండపల్లి వరకు పాదయాత్ర చేపట్టి, ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని, పశువైద్యుడిని అందుబాటులో ఉంచాలని, విద్యార్థులు, ప్రజలకు బస్సు సౌకర్యం కల్పించాలని, తలకొండపల్లి--పడకల్--రావిచ్చేడు రహదారిని విస్తరించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకుడు పెంటయ్య, సర్పంచ్ అనిత మల్లేష్, మాజీ సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకటాద్రి యాప్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

-తిరుమల భక్తుల కోసం 'వెంకటాద్రి' నావిగేషన్ యాప్ ప్రారంభం

-రూ.3,222 కోట్లతో తిరుపతిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం

-అలిపిరి వద్ద యాత్రికుల కోసం సమీకృత టౌన్‌షిప్‌కు శంకుస్థాపన

-మాస్టర్ ప్లాన్ రహదారులు, -టీటీడీ ఉద్యోగుల లేఔట్ పనుల ప్రారంభం

-తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం దిశానిర్దేశం

తిరుమల,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : తిరుమల శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఓ శుభవార్త అందించింది. కొండపైకి వచ్చే యాత్రికులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా క్యూలైన్లు, వసతి గదులు, అన్నప్రసాద కేంద్రాలు వంటి ముఖ్యమైన ప్రదేశాలను సులభంగా చేరుకునేందుకు 'వెంకటాద్రి' పేరుతో ఒక నూతన నావిగేషన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఈ యాప్‌ను ఆవిష్కరించారు. ఈ యాప్ ప్రత్యేకత ఏమిటంటే, కొండపై ఇంటర్నెట్ సిగ్నల్ లేకపోయినా ఆఫ్‌లైన్, జీపీఎస్ విధానంలో పనిచేస్తుంది. తెలుగుతో సహా ఐదు భాషల్లో అందుబాటులో ఉన్న ఈ యాప్‌లో, భక్తులకు మార్గనిర్దేశం చేసేందుకు ఏఐ ఆధారిత 'గోవింద' వాయిస్ అసిస్టెంట్ సదుపాయం కూడా ఉంది. అత్యవసర పరిస్థితుల్లో వైద్య సిబ్బంది లొకేషన్‌ను ట్రాక్ చేసే సౌకర్యం కల్పించారు. ఆపిల్ యాప్ స్టోర్, గూగుల్ ప్లే స్టోర్ల నుంచి దీనిని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

కీలక ప్రాజెక్టులకు శ్రీకారం

ఈ వెంకటాద్రి యాప్‌ను ఆవిష్కరించిన సందర్భంగా, ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి సమగ్రాభివృద్ధికి ఉద్దేశించిన మరిన్ని కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా), టీటీడీ సంయుక్తంగా చేపట్టనున్న రూ.3,222 కోట్ల విలువైన అభివృద్ధి పనులను సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన తిరుపతిని ఒక ఆదర్శ ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అలిపిరి వద్ద సమీకృత యాత్రికుల టౌన్‌షిప్

ఈ అభివృద్ధి పనుల్లో అత్యంత కీలకమైనది అలిపిరి వద్ద ఎస్వీ జూపార్క్ రహదారిలో నిర్మించతలపెట్టిన సమీకృత యాత్రికుల టౌన్‌షిప్. దీని నిర్మాణానికి సుమారు రూ.2,750 కోట్లు వెచ్చించనున్నారు. తిరుమల కొండపై వసతుల ఒత్తిడి తగ్గించి, తిరుపతిలోనే భక్తులకు అన్ని సౌకర్యాలు ఒకేచోట కల్పించడం ఈ ప్రాజెక్టు ఉద్దేశం. ఇందులో భాగంగా రూ.1,332 కోట్లతో పది అంతస్తుల

చొప్పున నాలుగు బ్లాకుల్లో 2,700 గదులను నిర్మించనున్నారు. దీని ద్వారా రోజుకు దాదాపు 16 వేల మందికి వసతి అందుబాటులోకి వస్తుంది. రూ.160 కోట్లతో నిర్మించే అన్నప్రసాద కేంద్రంలో ఒకేసారి 6 వేల మంది భోజనం చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్ సమస్య పరిష్కారానికి రూ.311 కోట్లతో 4,500 వాహనాలు నిలిపేలా బహుళ అంతస్తుల పార్కింగ్ సముదాయాన్ని, రూ.90 కోట్లతో సమీకృత రవాణా టెర్మినల్‌ను నిర్మించనున్నారు.

మౌలిక సదుపాయాల విస్తరణ

తిరుపతి నగరంలో ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ.242 కోట్ల వ్యయంతో 20 కిలోమీటర్ల పొడవున తొమ్మిది మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణ పనులను కూడా ప్రారంభించారు. ఈ రహదారులు జాతీయ రహదారుల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడంతో పాటు, తిరుచానూరు అమ్మవారి ఆలయానికి వెళ్లే భక్తులకు సౌకర్యవంతంగా ఉంటాయి.

టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత

శ్రీవారి సేవలో నిరంతరం పనిచేసే టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని సీఎం తెలిపారు. ఇందులో భాగంగా 418 ఎకరాల్లో 5,192 మంది ఉద్యోగులకు ఇళ్ల స్థలాల లేఔట్‌ను అభివృద్ధి చేస్తున్నారు. ఈ లేఔట్లలో అంతర్గత రహదారులు, డ్రైనేజీ, మంచినీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు రూ.230 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఉద్యోగుల కుటుంబాలు సంతోషంగా ఉంటే, వారు మరింత అంకితభావంతో భక్తులకు సేవలందిస్తారని సీఎం అన్నారు.

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

తిరుమల తరహా పవిత్రతను తిరుపతిలోనూ తీసుకురావాలని సీఎం అధికారులను ఆదేశించారు. తిరుపతిని కేవలం యాత్రా కేంద్రంగా కాకుండా ఆధ్యాత్మికత, పర్యావరణం, సాంకేతికత, విద్య, ఉపాధి, పర్యాటకంగా సమన్వయంతో అభివృద్ధి చేయాలన్నారు. నగరంలోని చెరువులను అనుసంధానించి సుందరీకరించాలని, 'వృక్షో గోవింద' కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించారు. మెరుగైన మౌలిక సదుపాయాలతో తిరుపతిని వివాహ వేడుకలకు, జాతీయ, అంతర్జాతీయ సదస్సులకు కేంద్రంగా మార్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్ర, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, తిరుపతి జిల్లా కలెక్టర్, తుడా అధికారులు వర్చువల్‌గా పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి

పక్షవాత బాధితుడు చంద్రశేఖర్ రెడ్డికి పరామర్శ

అమరచింత అక్టోబర్ 12 జర్నలిస్ట్ డైరీ : ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలనే ఉద్దేశంతో మక్తల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి ముందుకు వచ్చారు. అమరచింత మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి గత కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన, బాధితుడి నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు మల్లారెడ్డి, భరత్ రెడ్డి, కిసాన్ మోర్చా అధ్యక్షులు వెంకట్రాములు, అయ్యప్ప రెడ్డి, కుర్మా రెడ్డి, నర్సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా చూడాలి: ఎస్పీ డి.జానకి

మిడ్జిల్, అక్టోబర్ 12, జర్నలిస్ట్ డైరీ : మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ వ్యక్తిగత, కుటుంబ, భూ వివాదాలు, ఇతర సమస్యలకు సంబంధించి అందజేసిన దరఖాస్తులను ఎస్పీ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతి ఫిర్యాదుపై సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి, సమస్యల వివరాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై తగిన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణికి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి, బాధితుల సమస్యలను చట్టపరిధిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై జాప్యం లేకుండా తక్షణమే స్పందించాలని, ప్రతి దరఖాస్తుపై సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను నిర్ధారించిన అనంతరం చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయం చేయడం, వారి సమస్యలకు పరిష్కారం చూపడం పోలీస్ శాఖ ప్రధాన బాధ్యత అని పేర్కొంటూ, ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కారం లభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం పోలీస్ శాఖను సంప్రదించినప్పుడు వారికి న్యాయం జరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, అక్టోబర్12 జర్నలిస్ట్ డైరీ : ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని,ప్రతి ఓటరుకు న్యాయం జరగాలని ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం దేశ రాజధాని ఢిల్లీలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరిగిన అక్రమాలపై జవాబుదారీతనం కోరుతూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించాలని డిమాండ్ చేస్తూ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను కోరుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఓటర్ల హక్కుల పరిరక్షణ, ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఇండియా కూటమి నాయకులు ఈ నిరసన ద్వారా తమ డిమాండ్లను ముందుకు తీసుకువచ్చారు.ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

11 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు..

ఆమ్రపాలికి కీలక శాఖ

- -ఆమ్రపాలికి పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బాధ్యతలు
- -ఆగస్టు నుంచి జీఏడీలో వెయిటింగ్‌లో ఉన్న ఆమ్రపాలి
- -తొమ్మిది మందికి కొత్త పోస్టింగ్‌లు
- -మరో ఇద్దరు ఐఏఎస్‌లకు అదనపు బాధ్యతలు

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చేసింది. మొత్తం 11 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొందరికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో 2010 బ్యాచ్ ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలి కాటకు కీలకమైన పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారు.

జీవో నెం.1985 ప్రకారం..

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ జారీ చేసిన జీవో నెం.1985 ప్రకారం.. ప్రస్తుతం పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఆమ్రపాలిని యువజన సర్వీసులు, పర్యాటక, సాంస్కృతిక శాఖలో ప్రభుత్వ కార్యదర్శిగా నియమించారు. ఆమె ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 బ్యాచ్ అధికారి షంషేర్ సింగ్ రావత్‌కు రిపోర్ట్ చేయనున్నారు.

ఈ ఉత్తర్వుల ప్రకారం,

ఈ ఉత్తర్వుల ప్రకారం, పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2002 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సౌరభ్ గౌర్‌ను న్యూఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా నియమించారు. 2006 బ్యాచ్ అధికారి డి. మురళీధర్ రెడ్డికి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. దీంతో ఇప్పటివరకు ఆ పోస్టులో పూర్తి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.ఎం. నాయక్‌కు బాధ్యతల నుంచి ఉపశమనం లభించింది.

ఇతర ముఖ్య నియామకాలు...

మంజులే బాలాజీ దిగంబర్ (2009 బ్యాచ్): ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి.

కె. నీలకంఠ రెడ్డి (2017 బ్యాచ్): యువజన సర్వీసుల డైరెక్టర్. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఐఎఫ్‌ఎస్ అధికారిణి ఎస్. భరణిని తప్పించారు.

బి. అనిల్ కుమార్ రెడ్డి (2017 బ్యాచ్): పరిశ్రమలు, వాణిజ్య శాఖలో పరిశ్రమలు, ఎంఎస్‌ఎంఈ విభాగం సంయుక్త కార్యదర్శి.

ఎన్. తేజ్ భరత్ (2018 బ్యాచ్): ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి.

ఎం. వరప్రసాద్: ఏపీ పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్. ఈ పోస్టు పూర్తి అదనపు బాధ్యతల నుంచి కె. కన్నబాబుకు విముక్తి లభించింది.

గెదెల శ్రీను కుమార్: స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు శాఖ డిప్యూటీ సెక్రటరీ.

ఇద్దరికి అదనపు బాధ్యతలు

ప్రస్తుతం ఉద్యానవన, సెరికల్చర్ డైరెక్టర్‌గా ఉన్న డాక్టర్ కె. శ్రీనివాసులుకు వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా, పరిశ్రమల డైరెక్టర్‌గా ఉన్న శుభమ్ బన్సల్‌కు ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు కేటాయించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని సాధారణ పరిపాలన శాఖ స్పష్టం చేసింది

పొదిలి-దర్శి రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

- -అందుబాటులో లేని 108 అంబులెన్స్..
- -అరగంట ఆలస్యంగా మరో అంబులెన్స్ రాక

పొదిలి,మార్కాపురం, జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ : మార్కాపురం జిల్లా, పొదిలి పొదిలి--దర్శి ప్రధాన రహదారిపై పొదిలి మండలం మల్లవరం కాలనీ సమీపంలో సోమవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం. మృతులను మల్లవరం ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల కార్తీక్, పొదిలి మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన పేరం చెంచిరెడ్డి (55)గా గుర్తించారు.

ఘటనా స్థలంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిన పరిస్థితి ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడి రోడ్డుపై పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా కార్తీక్ తల వెనుక భాగంలో తీవ్ర గాయాలై రక్తస్రావం జరిగినట్లు సమాచారం. ప్రమాదం జరిగిన సమయంలో పొదిలిలో 108 అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో మరో అంబులెన్స్ రావడానికి సుమారు అరగంట సమయం పట్టినట్లు స్థానికులు తెలిపారు. తీవ్ర గాయాలతో బాధపడుతున్న క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందినట్లు సమాచారం.

బెంగుళూర బేల్దారు మేస్త్రీగా వేల్పుల కార్తీక్

మల్లవరం ఎస్సీ కాలనీకి చెందిన వేల్పుల కార్తీక్ బేల్దారు మేస్త్రీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి బెంగళూరుకు వెళ్లేందుకు టికెట్లు కూడా బుక్ చేసుకున్నట్లు తెలిసింది. ఇంట్లో మిక్సీ జార్ మరమ్మతు చేయించేందుకు పొదిలికి బయలుదేరిన కార్తీక్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మూడు వారాల క్రితమే

అతని తండ్రి మరియదాసు మృతి చెందగా, తల్లి మేరీకి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో కార్తీక్ పెద్దవాడు. తండ్రి మరణించిన కొద్ది రోజులకే కార్తీక్ కూడా ప్రమాదంలో మృతి చెందినట్లు సమాచారం రావడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

శుభలేఖలను బంధువులకు అందించేందుకు వెళ్తూ...

మరోవైపు గొల్లపల్లి గ్రామానికి చెందిన పేరం చెంచిరెడ్డి (55) తన కుటుంబంలో జరగనున్న వివాహానికి సంబంధించిన శుభలేఖలను బంధువులకు అందించేందుకు మల్లవరం వచ్చాడు. బంధువుల ఇంటి వద్ద శుభలేఖ ఇచ్చి కొంతదూరం ముందుకు వెళ్లిన అనంతరం తిరిగి వెనక్కి వచ్చి కుడివైపు మలుపు తీసుకుంటున్న సమయంలో ఎదురుగా వస్తున్న కార్తీక్ బైక్‌ను ఢీకొన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో ఇద్దరూ రోడ్డుపై పడిపోయి తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

విషాదంలో కుటుంబాలు

ఒకవైపు కుటుంబంలో వివాహ వేడుకకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో చెంచిరెడ్డి ప్రమాదానికి గురికావడం, మరోవైపు మూడు వారాల క్రితమే తండ్రిని కోల్పోయిన కార్తీక్ కూడా మృతి చెందినట్లు సమాచారం రావడంతో మల్లవరం, గొల్లపల్లి గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల మరణాలపై అధికారిక ధ్రువీకరణ, పోలీసుల ప్రకటన తెలియాల్సి ఉంది.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తిరుమల గ్రూపు ఆధ్వర్యంలో ఘనంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

జర్నలిస్ట్ డైరీ : :చౌటుప్పల్ అక్టోబర్ 12

చౌటుప్పల్ , అక్టోబర్ 12. .: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్రంలోని తిరుమల గ్రూపు ఆధ్వర్యంలో 'దేవీ శరన్నవరాత్రి' ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి పూజ ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులు శ్రీ కౌటికె విఠల్, కావ్య దంపతులు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా ఎమ్మెల్సీ శ్రీ బొగ్గారపు దయానంద్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి, మాజీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ ఉప్పల శ్రీనివాస్

పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర సా మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ చకిలం రమణయ్య, సీనియర్ సిటిజన్ ఫోరం తెలంగాణ రాష్ట్ర మాజీ కార్యదర్శి శ్రీ సింగిరికొండ నరసింహ,; సీనియర్ సిటిజన్ ఫోరం తెలంగాణ రాష్ట్ర మాజీ కోశాధ్యక్షుడు, ప్రాజెక్టు చైర్మన్ శ్రీ శ్రీకాకుళపు చలపతిరావు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జాతీయ న్యాయ సలహాదారు, AVOPA హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీ మధుపల్లి రవి గుప్తా,శ్రీ కొండూరు శ్రీనివాస్, షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ దిల్సుఖ్నగర్ మాజీ చైర్మన్ శ్రీ పూర నరసింహ, శ్రీ కర్నాటి వెంకటేశ్వర్లు, కైలాస శ్రీనివాస్, ఐ వి ఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు వాసవి మాత మందిర ఉపాధ్యక్షులు శ్రీ శంభు పండయ్య తదితరులు పాల్గొన్నారు..షిరిడీ తులసి భవన్‌కు చెందిన పలువురు ట్రస్టీలు పాల్గొన్నారు.

బిజినెస్

భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్‌లు..

-22,400 దిగువకు నిఫ్టీ..!

దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలతో ముగిశాయి. ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఐటీ షేర్ల లో అమ్మకాల ఒత్తిడి సూచీలను కిందకు లాగింది. భారీ మార్కెట్ విలువ కలిగిన కంపెనీల షేర్లలో బలహీనత కనిపించడంతో మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 547.65 పాయింట్లు నష్టపోయి 71,924.68 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 157.10 పాయింట్లు తగ్గి 22,363.35 వద్ద ముగిసింది. ప్రారంభంలో సానుకూలంగా కదిలిన నిఫ్టీ 22,600 స్థాయిని నిలబెట్టుకోలేకపోవడంతో అమ్మకాల ఒత్తిడికి లోనైందని మార్కెట్ నిపుణులు విశ్లేషించారు. నిఫ్టీకి తక్షణ మద్దతు 22,300–22,200 స్థాయిల మధ్య ఉందని నిపుణులు తెలిపారు. ఈ స్థాయి కిందకు దాటితే 22 వేల వరకు పడిపోయే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు మార్కెట్‌లో కోలుకోవడం కొనసాగాలంటే నిఫ్టీ తిరిగి 22,500–22,600 స్థాయిని అధిగమించాల్సి ఉంటుందని అంచనా వేశారు. నిఫ్టీలో అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజ్, ఐటీసీ, టెక్ మహీంద్రా షేర్లు అత్యధికంగా నష్టపోయిన వాటిలో నిలిచాయి. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు ఎక్కువగా పడిపోయాయి. అయితే మీడియా, కెమికల్స్ రంగాల షేర్లు లాభాలతో ముగిశాయి. ప్రధాన సూచీలు నష్టాల్లో ఉన్నప్పటికీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు కొంత మెరుగైన పనితీరు కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.08 శాతం పెరుగగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 1.42 శాతం లాభపడింది. రెండో త్రైమాసిక ఫలితాలపై ఆశలు మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లకు మద్దతిచ్చాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

పెరగనున్న సిమెంట్ ధరలు!

-ఒక్కో బస్తాపై రూ.10--15 వరకు పెరిగే అవకాశం
-పెరిగిన ముడిసరుకు ధరలు, ఉత్పత్తి ఖర్చులు
-ఈ వారంలో ధరల పెంపునకు కంపెనీల యోచన
-పండుగల సీజన్‌లో డిమాండ్‌పై ఆశలు
-ఆదాయాలపై ప్రభావం తగ్గించుకునేందుకు నిర్ణయం

హైదరాబాద్:
సిమెంట్ ధరలు మరోసారి పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉత్పత్తి వ్యయాలు, ముడిసరుకు ధరలు పెరగడంతో సిమెంట్ కంపెనీలు ఈ వారంలో ధరలను పెంచాలని యోచిస్తున్నట్లు ఎంకే రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. ఒక్కో సిమెంట్ బస్తాపై రూ.10 నుంచి రూ.15 వరకు పెంపు ఉండొచ్చని అంచనా వేసింది. గత ఆరు నుంచి ఏడు నెలలుగా ముడిసరుకు ధరలు పెరగడం సిమెంట్ పరిశ్రమపై భారంగా మారింది. దీంతో ఉత్పత్తి ఖర్చులు పెరిగి కంపెనీల ఆదాయాలపై ప్రభావం పడుతోంది. ఈ నేపథ్యంలో పెరిగిన వ్యయాలను భర్తీ చేసుకునేందుకు ధరల పెంపునకు కంపెనీలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు పండుగల సీజన్ ప్రారంభం కావడంతో నిర్మాణ రంగంలో సిమెంట్‌కు డిమాండ్ పెరుగుతుందని కంపెనీలు ఆశిస్తున్నాయి. డిమాండ్, సరఫరా పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో ధరల పెంపునకు ఇదే సరైన సమయమని భావిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. అయితే, ధరల పెంపు అమలైతే నిర్మాణ పనుల ఖర్చులు మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది ప్రతిపాదిత ధరల పెంపు మాత్రమే; కంపెనీల అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

తగ్గిన బంగారం ధరలు!

-22 క్యారెట్ల 10 గ్రాములపై రూ.400 తగ్గుదల
-24 క్యారెట్ల పసిడిపై రూ.440 కోత
-రూ.1,38,400కు చేరిన 22 క్యారెట్ల బంగారం
-రూ.1,50,980గా 24 క్యారెట్ల పసిడి ధర
-స్థిరంగా వెండి ధర.. కిలో రూ.2.45 లక్షలు

హైదరాబాద్:
బంగారం కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. సోమవారం బులియన్ మార్కెట్‌లో పసిడి ధరలు తగ్గాయి. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.400 తగ్గడంతో రూ.1,38,400కు చేరింది. అదేవిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.1,50,980గా నమోదైంది. మరోవైపు వెండి ధరలో ఎలాంటి మార్పు లేదు. కిలో వెండి ధర రూ.2,45,000 వద్ద స్థిరంగా కొనసాగుతోంది. బంగారం ధరలు తగ్గడంతో ఆభరణాలు కొనుగోలు చేయాలనుకునే వారికి కొంత ఉపశమనం లభించనుంది. అయితే, ధరల్లో రోజువారీ మార్పులు ఉండే అవకాశం ఉన్నందున కొనుగోలు చేసే ముందు తాజా ధరలను పరిశీలించడం మంచిది.

తెలుగు రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఇవే ధరలు కొనసాగనున్నాయి. అయితే, ఆభరణాల దుకాణాలను బట్టి తయారీ ఛార్జీల్లో వ్యత్యాసాలు ఉండవచ్చు. బంగారం కొనుగోలు చేసేటప్పుడు వర్తించే పన్నులు, తయారీ ఛార్జీలను కలిపి తుది ధరను తెలుసుకోవాలి. ప్రస్తుత ధరల ప్రకారం 22 క్యారెట్ల బంగారం 10 గ్రాములకు రూ.1,38,400, 24 క్యారెట్ల బంగారం రూ.1,50,980గా ఉండగా, కిలో వెండి ధర రూ.2,45,000గా ఉంది.

స్పోర్ట్స్

ముంబై ఇండియన్స్ ట్రేడింగ్ డీల్..

మహిళా పేసర్‌కు రూ.10 లక్షలు..!

: మహిళల ప్రీమియర్ లీగ్ ఐదో సీజన్ వేలానికి ముందే ముంబై ఇండియన్స్ ప్లేయర్ ట్రేడింగ్‌తో వార్తల్లో నిలిచింది. అలాఅనీ హార్దిక్ పాండ్యా ను వదులుకోలేదు. టీ20ల్లో నిలకడగా రాణిస్తున్న మహిళా పేసర్ తారా నోరిస్ ను ముంబై మహిళల జట్టు భారీ ధరకు కొన్నది. అసోసియేటెడ్ దేశాల ప్లేయర్ అయిన నోరిన్‌ను యూపీ వారియర్స్ నుంచి ముంబై కొనుక్కుంది. ఏకంగా రూ.10 లక్షలు ఇచ్చి ఈ ఎడమ చేతివాటం పేసర్‌ను తీసుకుంది ముంబై. నిరుడు వేలంలో నోరిస్‌ను యూపీ ఇంతే ధరకు కొన్న విషయం తెలిసిందే. ఐదో సీజన్ మహిళల ప్రీమియర్ లీగ్ వేలం సమీపిస్తున్న వేళ ముంబై ఇండియన్స్ కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 28న కొచ్చిలో వేలం జరగనుండగా.. అంతకు ముందే అనుభవజ్ఞురాలైె పేసర్‌ను ట్రేడింగ్ పద్ధతిలో తమ కుటుంబంలోకి ఆహ్వానించింది ముంబై. ఫ్రాంచైజీ క్రికెట్‌లో, డబ్ల్యూపీఎల్‌లో నిలకడగా రాణిస్తున్న తారా నోరిస్‌ను భారీ ధరకు దక్కించుకుందీ మాజీ ఛాంపియన్. గత ఎడిషన్‌లో యూపీ వారియర్స్‌కు ఆడిన ఈ లెఫ్ట్ ఆర్మ్ పేసర్‌ను రూ.10లకు కొనేసింది ముంబై. నాలుగో సీజన్ వేలంలో నోరాను యూపీ ఇంతే మొత్తానికి కొన్నది. దాంతో.. అంతే ధరకు ఇప్పుడు ఆమెను ముంబైకి అప్పగించింది యూపీ. తను ముంబైకి ఆడడం ఇదే మొదటిసారి కాదు. ఇదివరకు ది హండ్రెడ్ లీగ్‌లో ఎంఐ లండన్ జెర్సీతో నోరిస్ మైదానంలో మెరిసింది.

ఢిల్లీ వదిలేయడంతో

డబ్ల్యూపీఎల్‌లో తొలుత ఢిల్లీ క్యాపిటల్స్‌కు 2023 సీజన్‌లో ఆడిన తారా నోరిస్ ఆకట్టుకుంది. ఐదు మ్యాచులాడిన తను 4.33 సగటుతో తను 7 వికెట్లు తీసింది. ఆ తర్వాతి ఎడిషన్ వేలంలో నోరిస్‌ను యూపీ వారియర్స్ కొన్నది. అయితే.. మహిళల టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్ కోసం అమెరికా స్క్వాడ్‌కు ఎంపికవడంతో తను ఆ సీజన్ ఆడలేదు. 2026 సీజన్ వేలంలో యూపీ ఆమెకు రూ.10 లక్షలు చెల్లించింది. సెప్టెంబర్ 28న తుది గడువున నోరిస్‌ను అట్టిపెట్టుకుంది యూపీ. ఆ తర్వాత ముంబై ట్రేడింగ్ ప్రతిపాదన తీసుకురాగా తనను అంతే ధరకు అప్పగించేందుకు యూపీ అంగీకరించింది. దాంతో, వేలానికి ముందు ముంబై జట్టు విదేశీ ప్లేయర్ల కోటా నిండింది. ప్రస్తుతం ఎంఐ ఖాతాలో రూ.90 లక్షలున్నాయి.

49 ఏళ్లలో ఒకేఒక్కడు.. భారత దిగ్గజం సరసన లబూషేన్..!

సుదీర్ఘ ఫార్మాట్‌లో ఫామ్‌లేమితో విమర్శలు ఎదుర్కొంటున్న మార్నస్ లబూషేన్ దక్షిణాఫ్రికా పర్యటనలోనూ నిరాశపరుస్తున్నాడు. డర్బన్ టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పెద్ద స్కోర్ చేయలే. కానీ, 49 ఏళ్లలో ఎవరికీ దక్కని అరుదైన రికార్డు సాధించాడీ ఆసీస్ స్టార్. వరసగా రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ అతడు ఒకే స్కోర్ వద్ద ఔటయ్యాడు. అంతకుమించి ఆశ్చర్యపరిచే విషయం ఏంటంటే.. అతడు తొలి ఇన్నింగ్స్‌లో ఎన్ని బంతులాడాడో..దక్షిణాఫ్రికాతో డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా ఆటగాడు మార్నస్ లబూషేన్ అర్ధ శతకం కూడా చేయలే. అయినా సరే అతడు నెట్టింట వైరలవుతున్నాడు. అందుకు కారణం.. రెండు ఇన్నింగ్స్‌ల్లో తేలిపోయిన అతడు దాదాపు 50 ఏళ్ల టెస్టు చరిత్రలో ఎవరికీ సాధ్యమవ్వని రికార్డు పట్టేశాడు. వరసగా రెండు ఇన్నింగ్స్‌ల్లో ఒకే స్కోర్ చేయడమే కాదు సమానమైన బంతులు ఎదుర్కొన్న ప్లేయర్‌గా లబూషేన్ గుర్తింపు సాధించాడు. తొలుత 58 బంతులు ఆడి 37 పరుగులు చేసిన లబూషేన్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ 58 బంతులకు 37 పరుగులే చేసి ఔటయ్యాడు. దాంతో.. భారత దిగ్గజం సయ్యద్ కీర్మాణీ తర్వాత ఈ అరుదైన ఫీట్ సొంతం చేసుకున్న బ్యాటర్‌గా ఆసీస్ స్టార్ అవతరించాడు. 1977–78 సిరీస్‌లో ఆస్ట్రేలియాపై రెండు ఇన్నింగ్స్‌ల్లో 29 రన్స్ చేశాడు. అతడు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ 62 బంతులే ఆడడం విశేషం. రెండు ఇన్నింగ్స్‌ల్లో 5 అరుదైన ఫీట్.. భారత దిగ్గజం తర్వాత

పాకిస్థాన్‌పై నిప్పులు.. మూడేళ్లకు మళ్లీ సెంట్రల్ కాంట్రాక్ట్..!

: స్వదేశంలో ఇటీవల పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగిన ఓలీ రాబిన్సన్ కు ఇంగ్లండ్ సెంట్రల్ కాంట్రాక్టు దక్కింది. పునరాగమనంలో వికెట్ల వేటతో రెచ్చిపోతున్న ఈ పొడగరి పేసర్ వార్షిక కాంట్రాక్ట్‌కు ఎంపికయ్యాడు. 2026–27 సంవత్సరానికిగానూ సోమవారం ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డు 30 మందికి జాతీయ కాంట్రాక్టులు ప్రకటించింది. వీరిలో ఏడుగురికి తొలిసారి ఈ హోదా సొంతమైంది. అలానే దేశవాళీ క్రికెట్‌లో మెరుస్తున్న తొమ్మిది మంది కుర్రాళ్లకు డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ అప్పగించింది. ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు వార్షిక కాంట్రాక్టులను ప్రకటించింది. అంతర్జాతీయంగా నిలకడగా రాణిస్తున్న స్టార్ ఆటగాళ్లందరికీ కాంట్రాక్ట్ కొనసాగించింది. 2026–27 సంవత్సరానికిగా సోమవారం కెప్టెన్లు జో రూట్, హ్యారీ బ్రూక్‌లతో పాటు 30 మందికి వార్షిక వేతనాలను ఖరారు చేసింది. సొంతగడ్డపై పాకిస్థాన్‌తో సిరీస్‌లో పునరాగమనం చేసి 21 వికెట్లతో చెలరేగిన పొడగరి పేసర్ రాబిన్సన్

మూడేళ్ల తర్వాత కాంట్రాక్ట్ దక్కించుకున్నాడు. ఈమధ్య ఆకట్టుకున్న సామ్ కుక్, టామ్ బాంటన్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకొంబే, ఎమిలియో గే, మాథ్యూ ఫిషెర్, డాన్ లారెన్స్‌లకు తొలిసారి సెంట్రల్ కాంట్రాక్ట్ అప్పగించింది ఈసీబీ. టీ20ల్లో బంతితో అదరగొడుతున్న సోనీ బేకర్, కాక్స్, క్రొకొంబెలతో ఇంగ్లండ్ బోర్డు రెండేళ్ల ఒప్పందం చేసుకుంది. మొత్తంగా 11 మంది ఆటగాళ్లకు 2028 సెప్టెంబర్ 30వ తేదీ వరకు కాంట్రాక్ట్ కొనసాగనుందని ఈసీబీ వెల్లడించింది.

ఇంగ్లండ్ సెంట్రల్ క్రాంట్రాక్టు జాబితా 2026–27 : జో రూట్, హ్యారీ బ్రూక్, రెహాన్ అహ్మద్, జోఫ్రా ఆర్చర్, గస్ అట్కిన్సన్, సోనీ బేకర్, టామ్ బాంటన్, షోయబ్ బషీర్, జాకబ్ బెథెల్, బట్లర్, కార్సే, సామ్ కుక్, జోర్డన్ కాక్స్, హెన్రీ క్రొకంబే, సామ్ కరన్, లియాం డాసన్, బెన్ డకెట్, ఎమిలియో గే, మాథ్యూ ఫిషర్, విల్ జాక్స్, డాన్ లారెన్స్, సకీబ్ మహమూద్, జేమీ ఓవర్టన్, ఓలీ పోప్, మాథ్యూ పాట్స్, ఆదిల్ రషీద్, ఓలీ రాబిన్సన్, ఫిల్ సాల్ట్, జేమీ స్మిత్, జోష్ టంగ్.

ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ జాబితా 2026–27 : జేమీ కోల్స్, మసన్ క్రనే, జోష్ హల్, ఎడీ జాక్, బెన్ మెక్‌కిన్నే, లియాం ప్యాటర్సన్ వైట్, థామస్ రే, మాథ్యూ రెవిస్, మిచ్ స్టాన్లీ.

అతడి నిర్ణయమే ఫైనల్..

- పెళ్లి పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టిన మమితా బైజు



ప్రేమలు సినిమాతో తెలుగులో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది మలయాళ భామ మమితా బై . ఇటీవలే సూర్యతో నటించిన విశ్వనాథ్ అండ్ సన్స్ మూవీతోపాటు బెత్లెహామ్ కుటుంబ యూనిట్ సినిమాలతో మంచి హిట్స్‌ను ఖాతాలో వేసుకుంది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ ఫుల్ బిజీగా మారిపోయిన ఈ భామ పెళ్లిపై వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెడుతూ సోషల్ మీడియాలో పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. తాను ఎవరిని పెళ్లి చేసుకుంటాననే విషయంతోపాటు తన జీవితంలోని ప్రతీ స్టెప్‌ను తన సోదరుడు మిథున్ బైజు నిర్ణయిస్తాడని చెప్పింది మమితా బైజు. నేను, నా సోదరుడు మిథున్ బైజు స్నేహితుల కంటే ఎక్కువ. నాకు సంబంధించి ప్రతీ నిర్ణయం మిథునే తీసుకుంటాడు. నా పెళ్లి విషయంలో కూడా మిథున్ తీసుకునే నిర్ణయమే ఫైనల్. నాకు వచ్చే లవ్ ప్రపోజల్స్ ను హ్యాండిల్ చేసేది కూడా అతడే.. అంటూ కామెంట్ సెక్షన్‌లోకి ఎంట్రీ ఇచ్చిన మమితా బైజు ఏంటీ..? అని రాసి ఉన్న డైలామాతో కూడిన మినియన్ స్టిక్కర్‌ను పోస్ట్ చ్ఛ?స్తూ తన పెళ్లిపై వస్తున్న పుకార్లకు చెక్ పెట్టింది.

'రామాయణ' రెండో ట్రైలర్ దసరాకేనా..

-అక్టోబర్ 20న మరో భారీ అప్‌డేట్!

భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ అంచనాలు నెలకొల్పుతున్న చిత్రాల్లో 'రామాయణ' కూడా ఒకటి. దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక గాథలో బాలీవుడ్ స్టార్ రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయిపల్లవి సీతాదేవిగా, కన్నడ స్టార్ యశ్ రావణుడిగా కనిపించనున్నారు. అంతర్జాతీయ స్థాయి నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో చిత్రానికి సంబంధించిన రెండో థియేట్రికల్ ట్రైలర్‌ను దసరా సందర్భంగా విడుదల చేయనున్నారనే ప్రచారం ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.'రామాయణ' చిత్రానికి సంబంధించిన రెండో ట్రైలర్‌ను అక్టోబర్ 20, 2026న విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే రోజున ప్రపంచవ్యాప్తంగా ముందస్తు టికెట్ విక్రయాలు కూడా ప్రారంభం కానున్నాయని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే రెండో ట్రైలర్ విడుదల తేదీపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. దసరా పండుగ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేస్తే సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా శ్రీరాముడి శక్తి, రావణుడి భీకరమైన రూపాన్ని ప్రధానంగా చూపిస్తూ ఈ కొత్త ట్రైలర్‌ను రూపొందిస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ట్రైలర్‌లో ఉండబోయే సన్నివేశాల వివరాలపై కూడా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ఈ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడి పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి సీతాదేవిగా కనిపించనున్నారు. ఇక 'కేజీఎఫ్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యశ్.. రావణుడి పాత్రను పోషిస్తున్నారు. ఈ ముగ్గురు ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనుండటంతో సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి.శ్రీరాముడి ధర్మం, రావణుడి శక్తి, సీతాదేవి పాత్ర చుట్టూ సాగే కథను అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరపైకి తీసుకురావడమే చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా రణ్‌బీర్, యశ్ పాత్రల రూపకల్పన ఎలా ఉండబోతోందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. యశ్ కూడా నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం.

రామ్ చరణ్ -- అనిరుధ్ కాంబినేషన్ ఫిక్స్..

-క్రేజీ కాంబోపై భారీ అంచనాలు!

టాలీవుడ్‌లో ప్రస్తుతం స్టార్ హీరోల సినిమాలకు సంగీతం అందించే విషయంలో అనిరుధ్ రవిచందర్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. తనదైన సంగీతంతో దక్షిణాది సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న ఈ యువ సంగీత దర్శకుడు.. ఇప్పుడు మెగా అభిమానులు ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న ఓ క్రేజీ కాంబినేషన్‌లో భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు సుకుమార్ కలయికలో తెరకెక్కనున్న సినిమాకు అనిరుధ్ సంగీతం అందించనున్నారనే వార్త ప్రస్తుతం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది.రామ్ చరణ్‌కు టాలీవుడ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా మంచి గుర్తింపు ఉంది. మరోవైపు అనిరుధ్ రవిచందర్ తన సంగీతంతో భారీ సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దీంతో చరణ్ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తే ఎలా ఉంటుందనే ఆసక్తి చాలాకాలంగా అభిమానుల్లో ఉంది. ఇప్పుడు రామ్ చరణ్, సుకుమార్ కాంబినేషన్‌లో రానున్న చిత్రానికి అనిరుధ్ పేరు వినిపిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు మరింత పెరుగుతున్నాయి. అయితే ఈ కాంబినేషన్‌పై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రామ్ చరణ్, అనిరుధ్ కలిసి పనిచేయాల్సిన అవకాశం గతంలోనే వచ్చినట్లు తెలుస్తోంది. చరణ్ నటించిన యాక్షన్ చిత్రం 'బ్రూస్ లీ'కి తొలుత అనిరుధ్‌ను సంగీత దర్శకుడిగా ఎంపిక చేసినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. అయితే చివరకు ఆ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. అప్పట్లో రామ్ చరణ్‌తో కలిసి పనిచేయాలనే ఆసక్తిని అనిరుధ్ సామాజిక మాధ్యమాల్లో కూడా వ్యక్తం చేసినట్లు అభిమానులు గుర్తుచేస్తున్నారు. దీంతో వీరిద్దరి కలయిక ఎప్పుడు సాధ్యమవుతుందనే చర్చ అప్పటి నుంచే కొనసాగుతోంది. ఇప్పుడు సుకుమార్ దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసం ఈ కాంబినేషన్ కుదిరిందనే ప్రచారం రావడంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

అమ్మాయి షూటింగ్‌కి బయలుదేరింది

ఆ సినిమా తర్వాత రెండేండ్లపాటు నటనకు దూరంగా ఉన్న నివేదా.. మళ్లీ కెమెరా ముందుకు రానున్నది. 'శ్రీమతి' అనే ఫ్యామిలీ డ్రామాలో ఆమె నటించనున్నారు. విశ్వక్ ఖండేరావ్ దర్శకుడు. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈచిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానున్నది. ఈ కొత్త ప్రయాణం గురించి నివేదా థామస్ తన సోషల్ మీడియా వేదికగా స్పందించింది. 'అంతా సిద్ధమైంది.. ఓ కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నాను.ఇది నాకు తెలిసిన ప్రపంచమే అయినప్పటికీ ఎంతో అవసరమైనదీ.. ప్రత్యేకమైనది. కొత్త సినిమా సెట్‌లో మొదటి రోజు దగ్గర పడుతుండటంతో నాలో ఓ రకమైన ఆందోళనగా భయంగా ఉంది. ఇది ఆతృత కాదు. పని మొదలుపెట్టాలనే ఉత్సాహం. ఓ అమ్మాయి సినిమా చిత్రీకరణ కోసం బయలుదేరింది' అని నివేదా పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్‌గా మారింది.

డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట..

రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్దంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.

సర్దార్ డైరెక్టర్‌తో యశ్ సినిమా..

క్రేజీ టాక్ నిజమయ్యేనా..?

కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు కోలీవుడ్ డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్ ప్రాజెక్ట్ సర్దార్ 2 మాత్రం బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. తాజాగా ఈ తమిళ దర్శకుడికి సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. పీఎస్ మిత్రన్ ఇండియానా జోన్స్ ఫ్రాంచైజీ స్ఫూర్తిగా ఓ ఎక్సయిటింగ్ అడ్వెంచరస్ ఫిల్మ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట.ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ యశ్ హీరోగా కనిపించబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం పీఎస్ మిత్రన్ యశ్ కథ వినిపించగా.. సినిమా ఐడియా యశ్‌కు బాగా నచ్చిందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో యశ్ చాలా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ ఇద్దరి కాంబో సెట్స్‌పైకి వెళ్లడం పక్కా అని తెలుస్తోండగా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యశ్ ప్రస్తుతం నితేశ్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణ సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో రావణుడిగా కనిపించబోతున్నాడు యశ్. దీంతోపాటు యశ్ ప్రస్తుతమున్న ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత పీఎస్ మిత్రన్ ప్రాజెక్టు ముందుకు కదలనుందనే చర్చ నడుస్తోంది. మరి యశ్-పీఎస్ మిత్రన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పైకి రావాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలో మరి.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465